www.visalaandhra.com

బుధవారం
19-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 58
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఇండిగోకు డీజీసీఏ రూ.20 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగోకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూ.20లక్షల జరిమానా విధించింది. ఉదయ్‌పూర్ విమానాశ్రయం వద్ద ఇన్‌స్ట్రుమెంట్ ఫ్లైట్ ప్రొసీజర్‌ను ఉల్లంఘించినందుకు ఈ మేరకు ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌కు సమాచారం ఇచ్చింది. విమానాశ్రయాల్లోని స్టాండర్డ్ ఇన్‌స్ట్రుమెంట్ డిపార్చర్, ఇన్‌స్ట్రుమెంట్ ఫ్లైట్ ప్రొసీజర్‌ను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మాత్రమే అమలు చేయాలన్న నిబంధన ఉన్నది. ఇండిగో సంస్థ సొంత విధానాన్ని అమలు చేసింది. అందుకే డీజీసీఏ జరిమానా విధించింది. డీజీసీఏ నుంచి సోమవారం తమకు ఈ మేరకు సమాచారం అందినట్లు ఇండిగో పేర్కొంది.

అభివృద్ధికి కొత్త ప్రణాళికలు

- 9న తెలంగాణ రైజింగ్ విజన్ పత్రం విడుదల
- విద్యావ్యవస్థ మరింత మెరుగ్గ మార్చడమే లక్ష్యం
- పట్టణాభివృద్ధి మంత్రుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధితో పాటు కొత్త నగర నిర్మాణానికిగాను తెలంగాణ రైజింగ్ 2047 పేరిట కొత్త ప్రణాళిక రూపొందించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందినప్పుడే దేశాభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల్లో 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలని చెప్పారు. జీడీపీలో ఐదు మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి కీలకమని అన్నారు. గుజరాత్ రాష్ట్రానికి ఏ విధంగా సహకారం అందించారో అదే విధంగా తెలంగాణకు అందించాలని ప్రధాని మోదీని కోరుతున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి మంగళవారం హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర సహకారాన్ని కోరుతున్నామన్నారు. వచ్చే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్‌లో తెచ్చే ప్రణాళికలు రూపొందుతున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా... 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. దేశ సంపదలో 10 శాతంగా తెలంగాణ అందించగలగాలని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధితో పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, డ్రై పోర్టు ఏర్పాటునకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో తెలంగాణ పోటీ పడుతోందని అన్నారు. విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యా వ్యవస్థను మరింత మెరుగ్గామార్చాలన్న లక్ష్యానికి కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీల బలోపేతం, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇదిలావుంటే, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విశ్వవిద్యాలయంగా, బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, బీఆర్ఏఓయూ వీసీ ఘంటా చక్రపాణి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు స్థిర ఆదాయం — ఆర్థిక స్వావలంబన కోసం 151 సమాఖ్యలకు బస్సులు 2లో

ఆధునిక, సమగ్ర తెలంగాణ నిర్మిద్దాం

- 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వాములుకండి
- కొత్త విధానాలు ప్రకటిస్తాం
- బ్యాంకర్ల సదస్సులో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర–హైదరాబాద్: ఆధునిక, సమగ్ర, భవిష్యత్తుకు సన్నద్ధమైన తెలంగాణ నిర్మిందామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. 2047 తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలంటూ బ్యాంకర్లను కోరారు. డిసెంబరు 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నూతన విధానాలు ప్రకటిస్తామన్నారు. బేగంపేటలోని హోటల్‌లో మంగళవారం జరిగిన 47వ త్రైమాసిక బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి 13 శాతం జీడీపీ పెరుగుదల లక్ష్యంగా 2047 రోడ్ మ్యాప్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఏటా 10 శాతం చొప్పున పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్డును కలుపుతూ అనేక పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం, మూసీ పునర్జీవనం వంటి అంశాలను వివరించి పెట్టుబడిదారులు ఆకర్షించబోతున్నామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల వసతులను కలిగివుండటంతో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా అనువైనవన్నారు. కార్పొరేట్ సంస్థలతోపాటు స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ మధ్యతరహా, చిన్న పరిశ్రమలను బ్యాంకులు ప్రోత్సాహించాలని భట్టి విక్రమార్క సూచించారు. తద్వారా ఉపాధితోపాటు సంపద సృష్టికి అవకాశం ఉంటుందని చెప్పారు. జీడీపీ కూడా పెరుగుతుందన్నారు. సీఎస్ మొదలు కలెక్టర్ వరకు... ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని సంప్రదించి సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలని సూచించారు. విద్య మౌలిక సదుపాయాల కల్పనతోపాటు డిజిటలైజ్డ్ విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. రాష్ట్రం కీలకమైన అభివృద్ధి దశలో ప్రవేశిస్తోందని, ఇందులో బ్యాంకింగ్ రంగం ముందు ఉండాలని అన్నారు. బ్యాంకులు ఈ ఏడాది తొలి

- మిగతా 2 లో

చిన్నారుల మిస్సింగ్ ఆందోళనకరం

న్యూఢిల్లీ: దేశంలో చిన్నారుల మిస్సింగ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ... మిస్సింగ్ కేసులు దేశంలో తీవ్రమైన సమస్యగా మారుతున్నాయని పేర్కొంది. దత్తత ప్రక్రియ కఠినంగా ఉన్నందువల్ల... పిల్లలు లేనివారు చట్టవిరుద్ధ మార్గాలు ఎంచుకుంటున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సంక్లిష్టంగా ఉన్న దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, అక్రమ దత్తతను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్

- మిగతా 2 లో

జైషే పేరుతో బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. కోర్టులు, విద్యాసంస్థలే లక్ష్యంగా కొందరు దుండగులు ఈమెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. తీస్ హజారీ, సాకేత్ కోర్టులు లక్ష్యంగా ఢిల్లీ పోలీసులకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఇది పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే పేరుతో వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపుల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ముమ్మర సోదాలు చేపట్టారు. ద్వారక, సాకేత్, పటియాలా హౌస్, రోహిణి

- మిగతా 2 లో

మావోయిస్టు అగ్రనేత

హిద్మా కాల్చివేత

మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోయిస్టుల మృతి

- మృతుల్లో హిడ్మా భార్య రాజక్క
- కాల్పులతో దద్దరిల్లిన ఏఓబీ
- చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్... ఒకరి మృతి

విశాలాంధ్ర–రంపచోడవరం (అల్లూరి జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిద్మా మృతి చెందాడు. ఈ ఘటనలో హిద్మాతో పాటు ఆయన భార్య రాజే , అంగరక్షకులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ చనిపోయారు. ఆరుగురు మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మావోయిస్టుల మృతదేహాలను తీసుకొచ్చిన నేపథ్యంలో మార్చురీ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల గాలింపు ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిద్మా... బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా

- మిగతా 2 లో

హిద్మా ఎన్‌కౌంటర్ బూటకం

న్యాయవిచారణ జరపాలి

కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర బ్యూరో–కొత్తగూడెం: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడవి హిద్మాతో పాటు మరో ఐదుగురిని ఏకపక్షంగా కాల్చి చంపారని, ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. దీంతో పాటు గతంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నరహత్యలకు పాల్పడుతోందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్

- మిగతా 2 లో

సాక్షులందరికీ భద్రత కల్పించండి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పరకామణి చోరీ కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి టీటీడీ మాజీ సీవీఎస్వో సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం... కేసులోని నిందితులు, సాక్షుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రవికుమార్‌తో పాటు ఇతర సాక్షులందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలని ఏపీ సీఐడీ డీజీని హైకోర్టు ఆదేశించింది. కేసు విచారణ ముగిసేంత వరకు వారికి ఎలాంటి హాని కలగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం

- మిగతా 2 లో

ఓట్లచోరీ అస్త్రంగా ఎస్ఐఆర్

- కేంద్ర ఎన్నికల సంఘంపై ఖర్గే తీవ్ర విమర్శలు
- బీజేపీ కనుసన్నల్లో పనిచేయడం లేదని ఈసీ నిరూపించుకోవాలని డిమాండ్
- 12 రాష్ట్రాలు, యూటీల కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీ

న్యూఢిల్లీ: ఓట్ల చోరీకి పాల్పడేందుకు ఒక అస్త్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రస్తుతం ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత విచారకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ జరుగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం ఢిల్లీలో ఖర్గే సమావేశమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్, ఆయా రాష్ట్రాలు/యూటీల కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఐసీసీ ఇంచార్జ్‌లు, ఏఐసీసీ కార్యదర్శులు, సీఎల్పీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశ వివరాలను తెలియపరుస్తూ 'ఎక్స్' వేదికగా ఖర్గే ట్వీట్ చేశారు. బీజేపీ కనుసన్నల్లో పనిచేయడం లేదని ఈసీ వెంటనే నిరూపించుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు. '12 రాష్ట్రాలు/యూటీలలో ప్రస్తుతం ఎస్ఐఆర్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

డోంట్ వర్రీ! ఏం ధోకా లేదు! ప్రయివేటు వాళ్ళకమ్మేస్తున్నాం!

పోలవరం-బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు

అల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణకు అన్యాయం

జల్‌శక్తి మంత్రి పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర–హైదరాబాద్ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని, అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 45 టీఎంసీలు వెంటనే కేటాయించాలని, జల్‌శక్తి మంత్రిత్వ శాఖలో తెలంగాణకు చెందిన అంశాలు పెండింగ్‌లో ఉన్నందున కేంద్ర మంత్రిగా చొరవ చూపి వాటిని త్వరగా పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొత్తం 90 టీఎంసీల నీటి కేటాయింపు అడిగామన్నారు. వాటిల్లో 45 టీఎంసీల నీటిని వెంటనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేటాయించాలని కోరామని చెప్పారు. కేంద్ర మంత్రి పాటిల్

- మిగతా 2 లో

కేబినెట్ బెర్తులపై మల్లగుల్లాలు

- స్పీకర్ పదవి కోసం బీజేపీ, జేడీయూ మధ్య పోటీ
- బీహార్ ఎన్డీఏలో కొలిక్కిరాని చర్చలు

పట్నా: బీహార్‌లో ఈ నెల 20న కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న సంగతి తెలిసిందే. కాగా, మంత్రి పదవులు, స్పీకర్ పదవి కేటాయింపుపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మధ్య చర్చలు కొలిక్కి రాలేదు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం ఆయా పార్టీల మధ్య తీవ్రస్థాయిలో బుజ్జగింపుల పర్వం సాగుతోంది. ప్రత్యేకించి స్పీకర్ పదవి కోసం బీజేపీ, జేడీయూ మధ్య పోటీ నెలకొంది. రద్దుకానున్న అసెంబ్లీలో బీజేపీ నాయకుడు నంద్ కిషోర్ యాదవ్ స్పీకర్‌గా పనిచేయగా, జేడీయూకు చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. కీలక మంత్రివర్గ శాఖల కేటాయింపుతో పాటు స్పీకర్ పదవి అజెండాగా న్యూఢిల్లీలో ఇరు పార్టీల నేతలు చర్చిస్తున్నారు. జేడీయూ నేత విజయ్ చౌదరి, బీజేపీ నేత ప్రేమ్ కుమార్ స్పీకర్ పదవి రేసులో ఉన్నట్లు సంబంధిత వర్గాలు

- మిగతా 2 లో

ప్రజలు కేంద్రీకృతంగా సాగే డిజిటల్ పరిపాలనకు

తెలంగాణ మార్గదర్శి

- సాంకేతికత పరివర్తనలో ఆదర్శం
- యువతను ఏఐ నిపుణులు చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు
- 'మీ సేవ' వాట్సాప్ సేవల ప్రారంభం

విశాలాంధ్ర–హైదరాబాద్: ప్రజలు కేంద్రీకృతంగా సాగే డిజిటల్ పరిపాలనలో దేశానికి తెలంగాణ మార్గదర్శిగా ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సాంకేతికతల పరివర్తన (డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్)లో ఇతర రాష్ట్రాలకు రాష్ట్రం ఆదర్శం కావాలన్నారు. యువతకు కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యతను పెంపొందించేందుకు

- మిగతా 2 లో

బంగ్లాదేశ్ రణరంగం

- వీధుల్లోకి వచ్చిన వేలాది మంది: యుద్ధ క్షేత్రమైన ధన్మోండి
- బాష్పవాయువు, సౌండ్ గ్రెనేడ్లు, లాఠీల ప్రయోగం
- ఘర్షణల్లో ఇద్దరి మృతి : 50 మందికి గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ మళ్లీ రణరంగమైంది. మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష విధిస్తూ ఐసీటీ తీర్పు వెలువడటంతో దేశవ్యాప్తంగా ఆందోళనలకు దారితీసింది. హసీనా మద్దతుదారులు వేల సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. పెద్దఎత్తున నిరసన తెలిపారు. రాజధాని ఢాకాలో ఉద్రిక్తత నెలకొన్నది. అక్కడి ధన్మోండి 32 ప్రాంతం యుద్ధ క్షేత్రాన్ని తలపించింది. దేశవ్యాప్త సమ్మెకు అవామీ లీగ్ ఇచ్చిన పిలుపుతో ఉద్రిక్తలు నెలకొన్న దృష్ట్యా యూనస్ ప్రభుత్వం భారీగా పోలీసులు, సైన్యాన్ని రంగంలోకి దించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అయినప్పటికీ ఘర్షణలు జరిగాయి. 100కుపైగా సౌండ్ గ్రెనేడ్ల పేలుళ్లతో ధన్మోండి ప్రాంతం దద్దరిల్లింది. అల్లర్లలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, ఆర్మీ సిబ్బంది సహా 50 మందికి గాయాలయ్యాయి. ఇప్పటికే కూల్చివేసిన బంగాబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిలో మిగిలిన భాగాన్ని ధ్వంసం చేస్తామంటూ విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడం ఉద్రిక్తతలు పెంచింది. పోలీసులు, సాయుధ బలగాలు రంగంలోకి దిగినా శాంతి నెలకొనలేదు.

భారీగా బారికేడ్లు పెట్టి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా కలాబగాన్, పంతాపాథ్, జిగాటోలా, ధన్మోండి లేక్ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు, సౌండ్ గ్రెనేడ్లు ప్రయోగించారు. లాఠీ ఛార్జీ చేశారు. దీంతో టెన్షన్ మరింత పెరిగింది. భారీగా సైన్యాన్ని మోహరించినప్పటికీ నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. సౌండ్ గ్రేనేడ్ల మోత మోగినా... బాష్పవాయువు ప్రయోగించినా వెనుకడు వేసేందుకు ఆందోళనకారులు ఒప్పుకోలేదని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఒకరు తెలిపారు. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపినట్లు వెల్లడించారు.

మీడియాకు ప్రభుత్వ ఆదేశాలు

షేక్ హసీనా పోస్టులు, ప్రకటనలను ప్రచారం చేయెుద్దని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు యూనస్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. శాంతిభద్రతల దృష్ట్యా హింస, నేర కార్యకలాపాలను ప్రేరేపించే హసీనా వ్యాఖ్యలను ప్రసారం చేయొద్దని తేల్చిచెప్పింది. అలాంటి వాటిని ప్రసారం చేయడం సైబర్ భద్రతా ఆర్డినెన్స్ నిబంధనల ఉల్లంఘనే అవుతుందని హెచ్చరించింది. ఈ నేరానికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

ప్రపంచానికి కమ్యూనిజం అవసరం

ఏథెన్స్: సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించాలంటూ గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) పిలుపునిచ్చింది. ప్రపంచానికి కమ్యూనిజం ఎంతో అవసరమని, అది ఉంటేనే సౌభాగ్యమని నొక్కిచెప్పింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజధాని ఏథెన్స్‌లో భారీ ప్రదర్శన నిర్వహించింది. 'ప్రపంచ స్వేచ్ఛకు కమ్యూనిజం అవసరం. ప్రపంచ యువతకు కమ్యూనిజం అవసరం. ప్రపంచ సౌభాగ్యానికి కమ్యూనిజం అవసరం' వంటి నినాదాలతో వేలాది మంది కమ్యూనిస్టులు కదం తొక్కారు. 52వ పాలిటెక్నిక్ యూనివర్సిటీ అప్‌రైజింగ్-1973 వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల కార్యక్రమం ముగింపును పురస్కరించుకొని 'సామ్రాజ్యవాద వ్యతిరేక ర్యాలీ'ని కేకేఈ అట్టికా పార్టీ ఆర్గనైజేషన్ బ్యానర్ కింద నిర్వహించింది. కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రీ కౌట్‌సౌబస్‌తో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షులందరికీ భద్రత కల్పించండి

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. విచారణ సమయంలో అనవసర ఇబ్బందులు తలెత్తకుండా, సాక్షుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. పరకామణి చోరీ కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే విచారణ ఎదుర్కొంటున్న సతీశ్ కుమార్ అసహజ మృతిపై దిగ్భ్రాంతికి గురయ్యామని హైకోర్టు వ్యాఖ్యానించింది. సతీశ్ కుమార్ మరణంపై తొలుత అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును... ఆ తర్వాత కుటుంబ సభ్యుల ఆరోపణతో హత్య కేసుగా మార్చిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో సాక్షుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేసింది.

మహిళా సంఘాలకు స్థిర ఆదాయం

స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు

ఆర్థిక స్వావలంబన కోసం 151 సమాఖ్యలకు బస్సులు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరురాలను చేయాలనే సంకల్పంతో రేవంత్ సర్కార్ పనిచేస్తోంది. స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలను అందిస్తోంది. క్రమశిక్షణకు, నమ్మకానికి ప్రతీకలుగా నిలిచిన మహిళా సంఘాలకు చేయూతనిస్తోంది. ఆర్థిక స్వావలంబన కోసం పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుతో పాటు మండల స్థాయిలో ఆదాయం పెంపునకు సెర్ప్ ద్వారా 600 బస్సులు కొనుగోలు చేసి టీజీఎస్ ఆర్టీసీకి అద్దెకి ఇచ్చేలా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం అమలుకు ఆర్టీసీ-సెర్ప్ మధ్య ఒప్పందం జరిగింది. ప్రజా రవాణాలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషించడంలో మొదటి దశలో భాగంగా సెర్ప్ గుర్తించిన 17 జిల్లాలలోని 151 మండల మహిళా సమాఖ్యలకు ఒక్కొక్క బస్సు (మొత్తం 151) కొనేందుకు ఆర్థిక సహాయం అందించింది. రెండవ దశలో 449 బస్సులు కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క బస్సుకు రూ.36 లక్షల వ్యయం కాగా అందులో రూ. 6లక్షలను మండల మహిళా సమాఖ్య భరిస్తుంది. రూ.30 లక్షలను కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్‌గా అందించారు. ఆర్టీసీ ప్రతి బస్సుకు రూ.69,648 చొప్పున ప్రతి నెలా అద్దె చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 కార్యనిర్వాహక వ్యయం కాగా మిగతా రూ.50 వేలు రుణ చెల్లింపులకు వినియోగమవుతుంది. ఈ పథకంతో గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రైవేటు వ్యక్తుల బస్సులను ఆర్టీసీ అద్దెకు తీసుకొని నిర్వహించేది. నేడు మహిళా సంఘాలు ఆర్టీసీకి బస్సులను అద్దెకు ఇస్తున్నాయి. ప్రభుత్వ సహకారంతో మహిళలు ముందడుగు వేస్తున్నారు. అద్దెకు ఇచ్చిన బస్సులపై ఇందిరా మహిళా శక్తి మండల సమాఖ్య పేరు కనిపిస్తుంది. అది చూసి గర్వపడుతున్నట్లు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల మహిళా అధ్యక్షురాలు అన్నారు. మంత్రి సీతక్క సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధునిక, సమగ్ర తెలంగాణ నిర్మిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

అర్ధభాగంలో 49.45 శాతం ప్రాధాన్య రంగ రుణాలను సాధించాయని చెప్పారు. క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి 130.18 శాతంగా ఉండటం తెలంగాణ ఆర్థిక ప్రయాణంపై ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తుందని తెలిపారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిజంగా మార్పు చేయాలంటే పంట కోత తర్వాతి మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సూక్ష్మ పంట నీరు, అనుబంధ రంగాల్లో బ్యాంకు రుణాలు పెంచాలని బ్యాంకర్లకు సూచించారు. తెలంగాణలో వరి ఉత్పత్తి అద్భుతం, కానీ పరిమాణం నుంచి విలువ వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ ఆదాయాలను భద్రపర్చే పామ్ ఆయిల్‌తో పాటు ఇతర పంటలకు బ్యాంకుల మద్దతు కోరారు. తెలంగాణ అభివృద్ధిలో బ్యాంకులు బలమైన పాత్ర వహించాలని, ఆర్థిక చేర్పు విస్తరణలో కృషి అభినందనీయమే అయినా కొన్ని లోటుపాట్లు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పీఎంజెడీవై శాతం, బీమా కవరేజ్, ఇంకా కొందరు గ్రామ పంచాయతీల్లో బీసీల లభ్యత తదితర అంశాలను వివరించారు. డిజిటల్‌గా శక్తివంతమైన, ఆర్థికంగా భద్రత కలిగిన పౌర సమాజం సమగ్రంగా, భవిష్యత్‌కు సిద్ధమైన తెలంగాణ కోసం కీలకమని భట్టి విక్రమార్క నొక్కిచెప్పారు. తెలంగాణ రైజింగ్‌కు రాష్ట్రం సిద్ధమవుతోంది. తన దృష్టి, రాబోయే దశాబ్దానికిగాను కార్యాచరణను ప్రపంచానికి పరిచయం చేయబోతోంది అని భట్టి విక్రమార్క అన్నారు. గ్రామీణ పరివర్తనం, బలమైన ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, అధిక విలువ కలిగిన తయారీ, డిజిటల్ పరిపాలన, గ్రీన్ గ్రోత్ ఇవి తదుపరి దశకు దారితీసే రంగాలు అని డిప్యూటీ సీఎం వివరించారు. దీనికోసం బ్యాంకులు లావాదేవీ విధానం నుంచి రూపాంతరక భాగస్వా మ్యం వైపు మారాలని సూచించారు. తెలంగాణ స్థిరత్వం, ఆశయం, అవకాశాలను అందిస్తోందని, క్రెడిట్ విస్తరణ, నవీన ఆర్థిక పరిష్కారాలతో, ఆత్మవిశ్వాసం, సమిష్టి కర్తవ్యంతో ఒక ఆధునిక, సమగ్ర, భవిష్యత్తుకు సిద్ధమైన తెలంగాణను నిర్మిద్దామని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తదుపరి దశాబ్దాన్ని తెలంగాణ చరిత్రలో అత్యంత రూపాంతరక కాలంగా మలుద్దామని అన్నారు.

కేబినెట్ బెర్తులపై మల్లగుల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించాయి. కొత్త మంత్రివర్గంలో ఎన్డీఏలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీయూ నుంచి ఐదు నుండి ఆరుగురు కొత్త ముఖాలు ఉంటాయని తెలిపాయి. మహ్నార్ అసెంబ్లీ స్థానం ఎన్నికైన జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ సింగ్ కుష్వాహా కొత్త మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. సీఎం నితీశ్‌కుమార్ ఈ నెల 19న గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు రాజీనామా సమర్పించనున్నారు. ప్రస్తుత అసెంబ్లీ అదే రోజు (బుధవారం) రద్దు కానుంది. జేడీయూ, బీజేపీ రెండూ బుధవారం తమ తమ శాసనసభ పార్టీ నాయకులను ఎన్నుకుంటాయి. జేడీయూ తన ప్రస్తుత మంత్రులను తదుపరి మంత్రివర్గంలో పునరావృతం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, బీజేపీ కొంతమంది కొత్త ముఖాలను తీసుకురావచ్చని వర్గాలు తెలిపాయి. ఈ రెండు ప్రధాన పార్టీలతో పాటు కొత్త మంత్రివర్గంలో కూటమిలోని చిన్నపార్టీలైన ఎల్జేపీ (రాంవిలాస్), హెచ్ఏఎం-ఎస్, ఆర్ఎల్ఎం పార్టీలకు కూడా మంత్రి పదవులు దక్కనున్నాయి. ఎల్జేపీకి 3 మంత్రి పదవులు, హెచ్ఏఎం-ఎస్, ఆర్ఎల్ఎం ఒక్కొక్క మంత్రి పదవి దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీజేపీ 18, జేడీయూ 14 చొప్పున మంత్రిపదవులు పంచుకుంటాయని, నితీశ్‌కుమార్ ఈ నెల 20న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలిసింది. ప్రమాణ స్వీకారోత్సవం జరిగే చారిత్రాత్మక గాంధీ మైదానంలోకి నవంబర్ 20 వరకు సాధారణ ప్రజలకు ప్రవేశం నిలిపివేస్తున్నట్లు పట్నా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని భావిస్తున్నందున పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సహా అనేకమంది ఎన్డీఏ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు.

ఓట్లచోరీ అస్త్రంగా ఎస్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ జరుగుతున్న తీరుపై మేం పార్టీపరంగా సమీక్ష నిర్వహించాం. ఓటర్ల జాబితా సమగ్రత దెబ్బతినకుండా చూడటానికి మేం కట్టుబడి ఉంటాం. దీనిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదు. ప్రజాస్వామిక సంస్థలపై ప్రజలకున్న విశ్వాసం సన్నగిల్లుతున్న వేళ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ నిర్వహిస్తున్న తీరు చాలా బాధ కలిగించేలా ఉంది. ఈ తరుణంలో బీజేపీ కనుసన్నల్లో పనిచేయడం లేదని వెంటనే నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఏ అధికార పార్టీకీ తలొగ్గకుండా, కేవలం భారత ప్రజలకు విధేయతగా ఉంటామని చేసిన రాజ్యాంగ ప్రమాణాన్ని ఈసీ గుర్తుంచుకోవాలి. ఓట్లచోరీకి పాల్పడేందుకు ఒక అస్త్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ వాడుకుంటోందని మేం నమ్ముతున్నాం. ఒకవేళ ఇలాంటి మార్గాన్ని ఈసీ ఎంచుకొని ఉంటే, ఈ వైఫల్యం పాలనాపరమైన అంశానికి పరిమితం కాదు.

ఓ తప్పుకు ఈసీ మౌనంగా సహకరిస్తున్నట్లుగా భావించాల్సి వస్తుంది' అని ఖడ్గే స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాలు/యూటీలలో తమ పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు, జిల్లా/నగర/బ్లాక్ స్థాయి అధ్యక్షులు చాలా అప్రమత్తంగా ఉన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏ ఒక్క తప్పుడు ప్రయత్నం జరిగినా బట్టబయలు చేస్తామని ఖడ్గే హెచ్చరించారు. బోగస్ ఓట్ల చేరికను అడ్డుకుంటామని, వాస్తవిక ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోకుండా చూస్తామని తెలిపారు.

హిడ్మా కాల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు చత్తీస్‌గఢ్‌లోని ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.

ఉలిక్కిపడ్డ ఏజెన్సీ...

ప్రముఖ పర్యాటక ప్రాంతం గా పేరొందిన మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో ఏజెన్సీ ఉలిక్కి పడింది. జిల్లా కేంద్రం పాడేరు సహా ఏజెన్సీ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఏపీ ఇంటిలిజెన్స్ అధిపతి మహేష్ చంద్ర లడ్డా రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించారు. గత కొద్దినెలలుగా హిడ్మా ఏఓబీలో ప్రవేశించినట్లు నిఘావర్గాల నుంచి సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నామని, ఈ రోజు మారేడుమిల్లి టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు కొందరు మావోయిస్టు లు తారసపడటం తో అర గంట కు పైగా జరిగిన ఎదురు కాల్పులు జరిగాయని తెలిపారు. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని, అందులో మావోయిస్టు అగ్రినేత హిడ్మా తో పాటు అతని భార్య రాజే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కాగా మరి కొందరు మావోయిస్టులు అటవీ ప్రాంతం లో కి పారి పోయారని, వారికోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47 లు , ఒక పిస్టల్ , ఒక రివాల్వర్ , ఒక సింగిల్ బార్ వెపన్ తో పాటు మందుగుండు కిట్ బ్యాగ్‌లు, వైర్ లు తదితర సామాగ్రి స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు.

హిడ్మాపై కోటి రూపాయల రివార్డు

చత్తీస్‌గఢ్‌లో గిరిజన తెగ కు చెందిన హిడ్మా భద్రతా దళాలు , ప్రజా ప్రతినిధులు పై జరిగిన అనేక దాడుల్లో పాల్గొన్నాడు. 26 పైగా దాడుల లో నిందితుడిగా ఉన్నాడు. ఇతడిపై కోటి రూపాయలు పైగా రివార్డు ఉంది. చాలా తక్కువ సమయం లో నే మావోయిస్టు పార్టీ లో కీలక నేతగా ఎదిగాడు. మొదటి నుండి చత్తీస్‌గఢ్‌లోని సుక్మా, దంతెవాడ తప్ప ఏఓబీ లో అసలు పట్టు లేని హిడ్మా... ఒక వైపు కేంద్ర బలగాల కూంబింగ్ మరో వైపు మావోయిస్టుల వరుస ఎన్‌కౌంటర్‌లు, లొంగుబాట్లతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కొంత కాలం తల దాచుకోవడానికి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏఓబీ)అటవీ ప్రాంతంలోకి వచ్చాడు. కర్రెగుట్ట ను భద్రతాదళాలు చుట్టు ముట్టినప్పుడు కూడా చాక చక్యంగా తప్పించుకోగల్గిన హిడ్మా... మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మాత్రం నేలకొరిగాడు.

తెలంగాణ మార్గదర్శి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏటా 10 లక్షల మందికి ఏఐ శిక్షణ కల్పిస్తామన్నారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంలో రూపొందించిన 'మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్'ను బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో మంత్రి మంగళవారం ప్రారంభించారు. పాలనలో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ సాంకేతికతతో సేవలను వారి ముంగిటకే చేరుస్తూ సుపరిపాలన వైపు తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీని అంటే సమానత్వ సాధనమన్నారు. దాని ఫలాలు ప్రతి వ్యక్తికి చేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఇన్నోవేషన్ హబ్‌తో 'డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్'లో తెలంగాణ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని మంత్రి అన్నారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణను అనుసరించేలా మీ సేవ సేవలు అందిస్తామన్నారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కుపైగా పౌర సేవలను వాట్సాప్‌లో ప్రజలకు అందుబాటులోకి ఉంటాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇతర ప్రభుత్వ విభాగాలకు వీటిని విస్తరిస్తామన్నారు. త్వరలోనే తెలుగు, ఉర్దూలోనూ ఈ సేవలను అందిస్తామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జెన్ ఏఐ, మొబైల్ ఫస్ట్ అప్రోచ్ ద్వారా పౌర సేవలు అందించే ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. టైప్ చేయాల్సిన అవసరం లేకుండా వాయిస్ కమాండ్‌తోనే సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, మీ సేవ కమిషనర్ రవి కిరణ్, మెటా ప్రతినిధి నటాషా తదితరులు పాల్గొన్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

(మొదటిపేజీ తరువాయి)

అంటే రెండు వర్గాల మధ్య పరస్పరం సాగే కాల్పులని, హిడ్మా ఎన్‌కౌంటర్‌ను పరిశీలిస్తే అందరినీ ఒక చోట కాల్చి చంపినట్లుగా ఉన్నదన్నారు. భావజాలం ఏదైనా ఆదివాసీ నాయకుడిని పట్టుకొని కోర్టులో ప్రవేశ పెట్టె అవకాశం ఉన్నప్పటికీ దారుణంగా చంపాల్సిన అవసరం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. ఎప్పటిలాగే పోలీసు వ్యవస్థ కట్టుకథ అల్లి ఎన్‌కౌంటర్ పేరు పెట్టిందని దుయ్యబట్టారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారనే విషయం పోలీస్ వ్యవస్థ, ప్రభుత్వాలు గమనంలో ఉంచుకోవాలని కూనంనేని హెచ్చరించారు. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకొవచ్చని, కమ్యూనిస్టుల అంతానికి కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. 2026 మార్చికి మావోయిస్టులు లేకుండా చేస్తామన్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా... ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపిచేస్తున్నారని కూనంనేని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ అరాచక పాలన అంతానికి పిలుపునిచ్చారు. బీహార్ ఎన్నికల్లో ప్రతిపక్షాల ఓట్ల గల్లంతు చేసి, ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించినందునే ఎన్డీయే విజయం సాధించిందని కూనంనేని వ్యాఖ్యానించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు నలిగంటి శ్రీనివాస్, జి. వీరస్వామి, చంద్ర నరేంద్ర, వంట్టికొండ మల్లికార్జునరావు, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, రత్న కుమారి, ఏఐటీయూసీ నేత వంగా వెంకట్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం: కేటీఆర్

విశాలాంధ్ర-ఆదిలాబాద్: రైతులకు అన్యాయం జరుగుతోందని, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తమ పార్టీ ఎల్లప్పుడు రైతులకు బాసటగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు రైతులు, వ్యాపారులు బలవుతున్నారని విమర్శించారు. అతివృష్టి, తేమ శాతం, మద్దతు ధర, కొనుగోళ్లు లేకపోవడం వంటి అంశాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని పాలకులను హెచ్చరించారు. ఈనెల 21న భోరజ్‌లో రైతు ధర్నా జయప్రదానికి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులతో ముఖాముఖి భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కపాస్ కిసాన్‌యాప్, మద్దతు ధర, తేమ శాతం, ఏడు క్వింటాళ్ల వరకే పత్తి కొనుగోలు పరిమితం, సోయ బయోమెట్రిక్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను రైతులు ఆయనకు తెలిపారు. కేటీఆర్ అనంతరం బీఆర్ఎస్ నాయకులతో, రైతులతో కలిసి వెళ్లి సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, మాజీ మంత్రులు జోగు రామన్న, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం-బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సహా సీడబ్ల్యూసీ చైర్మన్‌కు కూడా ఇదే విషయం చెప్పడం జరిగిందన్నారు.

సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇవ్వండి

'గోదావరి జలాల్లో... సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పించాం. సీడబ్ల్యూసీకి అనేక సందర్భాల్లో వారు అడిగిన వివరాలు ఇచ్చాం. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. దాని పూర్తి వివరాలు మళ్లీ సమర్పించాం. బ్రిజేష్ ట్రిబ్యునల్ (కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-2) ఏపీ-తెలంగాణ మధ్య 811 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు విభజించాలి. దీనికి సంబంధించిన ప్రక్రియలు నెమ్మదిగా జరుగుతున్నాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి... జస్టిస్ బ్రిజేష్‌ను అభ్యర్థించి వేగవంతంగా తుది ఖరారు చేయించాలని కోరాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను సమర్పించిందని, దానిని తాము వ్యతిరేకించామన్నారు. అది చాలా స్పష్టంగా గోదావరి జల వివాదాల 1980 అవార్డులో వరద నీటిని కేటాయించడానికి ఎవరికీ ఎటువంటి ఆస్కారం లేదనే విషయాన్ని అప్పుడు కూడా లేవనెత్తామని తెలిపారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు టర్మినల్ ఫేజ్ మార్చి, ప్రాజెక్టు పేరు మార్చి... తిరిగి గోదావరి ఫ్లడ్ వాటర్ స్పేర్‌పై మరొకసారి కేంద్రానికి వస్తున్న సందర్భంగా తాము దీనికి కూడా వ్యతిరేకమని చెప్పామని మంత్రి వివరించారు. స్పష్టంగా, లిఖితపూర్వకంగా కేంద్ర మంత్రిగా వివరించామన్నారు. ఈ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్నాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ఆల్మట్టి డ్యాం 519 మీటర్ల కంటే ఎత్తు పెంచొద్దని సుప్రీం కోర్టులో స్టే ఉందని, అయితే కర్నాటక ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసి... జీవో ఇచ్చి ఎత్తు పెంచడానికి భూసేకరణ కోసం ముందుకు వెళుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచకుండా కర్నాటక ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి

'నీటిపారుదల కోసం గత 22 నెలల నుంచి కేంద్ర నిధులను అడిగాం. ఇప్పటివరకు ఫండింగ్ ఇచ్చిన ప్రాజెక్టులను మీరు పూర్తి చేయండని గతంలో నేను, సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు చెప్పారు. ఆ సూచన మేరకు దేవాదుల ప్రాజెక్టు మినహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేశాం. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేము కొన్ని ప్రాజెక్టులను జాబితా చేశాం. వాటిని సీడబ్ల్యూసీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇప్పించాలని కోరాం. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు, నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మోదికుంట వాగు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అడిగాం' అని మంత్రి వెల్లడించారు. కాగా, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం... కృష్ణా నది నీటిని ఎవరూ ఎక్కువ డైవర్ట్ చేయడం, దుర్వినియోగం చేయరాదని కేఆర్ఎంబీకి అధికారం ఇచ్చారని, అయితే గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదని తెలిపారు. తాము వచ్చిన తర్వాత అనేక సార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి... సీడబ్ల్యూసీ చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు టీఏసీ, ఐటీసీ అనుమతులు ఇవ్వాలని, తెలంగాణ-ఆంధ్రా మధ్య కృష్ణా నీటి పంపకాలు ట్రిబ్యునల్ ద్వారా త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు.

చిన్నారుల మిస్సింగ్ ఆందోళనకరం

(మొదటిపేజీ తరువాయి)

బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే విధానం ఎక్కువైందని, దత్తత ముసుగులో చిన్నారుల అక్రమ రవాణా, అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తప్పిపోయిన పిల్లల కేసులపై విచారణ చేపట్టడానికి నోడల్ అధికారిని నియవిoచడానికి ఆరు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన ధర్మాసనం డిసెంబర్ 9 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. మిస్సింగ్ కేసులను అరికట్టడానికి ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పేర్కొంది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు గతనెల 14న కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి... తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది.

జైషే పేరుతో బాంబు బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

కోర్టులను అప్రమత్తం చేశారు. సిబ్బందిని బయటికి పంపి తనిఖీలు చేశారు. ద్వారక, ప్రశాంత్ విహార్‌లోని రెండు సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు కూడా బెదిరింపులు వచ్చాయి. ఇప్పటివరకు ఎలాంటి అనుమానిత వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు... బెదిరింపులకు పాల్పడిన వారిని కనుగొనేందుకు దర్యాప్తు చేపట్టారు.

జిల్లాకు 'జల సంచాయ్-జన్ భాగీదారి' అవార్డు

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్-జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు.నిర్మల్ జిల్లాకు జల సంచాయ్- జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'జల్ చంచాయ్ -జన్ భాగీధారీ' అవార్డు

విశాలాంధ్ర ప్రతినిధి , ఆదిలాబాద్: జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జల్ చంచాయ్ -జన్ భాగీధారీ' కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదకద్రవ్యాల నిరోదానికి కృషి చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : మాదకద్రవ్యాల నిరోదానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు, రెవెన్యు) లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్, సమక్షంలో అధికారులు, ఉద్యోగులు అందరూ కలసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మిన, కొనుగోలు చేసిన ,అక్రమ రవాణా చేసిన ఆ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని కోరారు .డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.,అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన రాజు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత, సి.డి.పి.ఓ శిరీష, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు బి.శ్రీనివాస రావు, శ్రీనివాస్, మెప్మా అధికారిణి విజయ, అంగన్ వాడీ టీచర్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తోంది :ఎస్పీ

విశాలాంధ్ర- వనపర్తి : మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'నషా ముక్తా భారత్ అభియాన్' ఐదేళ్ల పూర్తి అయిన సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని డ్రగ్స్‌ను జీవితంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, ఇతరులను కూడా వాటి నుంచి తప్పించే బాధ్యత వహిస్తామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ యువతను, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర విషమన్నారు. పోలీస్ శాఖ కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, ప్రజల్లో అవగాహన పెంచడం మా కర్తవ్యం వనపర్తి జిల్లా డ్రగ్స్ రహితంగా నిలవాలంటే ప్రతి ఒక్కరు బాధ్యతతో ముందుకు రావాలి పోలీసులు ముందుండి నడిపిస్తారు, సమాజం తోడుంటే మేము విజయాన్ని సాధిస్తాం అని పోలీస్ విభాగం మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో కఠిన చర్యలు తీసుకుంటుందని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారిలో అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన, రవాణా చేస్తున్న, అమ్మిన అట్టి వ్యక్తుల సమాచారం లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1908కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రతి పోలీసు, యువత సైబర్ వారియర్గా పనిచేస్తున్నారు అని ఇకనుండి యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్ గా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ నాయక్,వనపర్తి సీఐ, కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, రిజర్వు ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జైళ్లశాఖ డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ కమిషనర్

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : ఖమ్మం జిల్లాకు చేరుకున్న జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం మామ ఆమె ఖమ్మం వచ్చారు.

కవులు సమాజ సంపద : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కవులు, కళాకారులు ఈ సమాజ సంపదతో సమానమని, వారి భావాలు సమాజానికి దర్పణం అలాంటి వనీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కవులు ప్రపంచంలోని అన్ని రంగాలపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఉత్తమ కవులుగా రాణించగలరన్నారు. 58వ జాతీయ గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడారు. ఓ కవి కలం నుంచి జాలువారే ప్రతీ సిరా చుక్క వేయి మెదళ్లను కదలించగలిగే శక్తిగా ఉంటుందన్నారు. బడబాగ్నిని రగిలించే అక్షరానికి అంతటి మహత్తర శక్తి ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా కవులుగా ఉండటం ఎంతో అదృష్టమన్నారు. మీరు రాసే కవితలు, రచనలు రాబోయే రోజుల్లో జన చైతన్యం కలిగించి చక్కటి ప్రాచుర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. తనకు పుస్తక పఠనం అంటే ఎంతో ఇష్టమన్నారు. అనేక మంది కవులు, రచయితలు రాసిన పుస్తకాలను చదివినట్లు చెప్పారు. విద్యార్థులు పుస్తక పఠనం పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు భిన్న రంగ పుస్తకాలు చదివేతే చాలా పరిపక్వత వస్తుందన్నారు. ఇంత ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయానికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రంథాలయాభివృద్ధికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కవులను సన్మానించారు. ముందుగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ కార్యదర్శి సాబీర్ పాష, గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి, ఎంపిడిఓ కె. అంబిక, గ్రంధపాలకురాలు గుమ్మడి మణిమృదుల, మధుబాబు, వాణి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం : సీపీఐ

విశాలాంధ్ర - హుస్నాబాద్ : మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందని సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజానాట్యమండలి కళాకారులతో కమ్యూనిస్టు వాటి నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ సంపదను బడా వ్యాపార స్తులైన ఆదాని, అంబానీ వంటి కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతుందని ఆరోపించారు. వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించినప్పుడు బిజెపి పుట్టలేదన్నారు. మావోయిస్టులు ప్రజల పక్షాన పోరాడుతున్నారని ఆపరేషన్ కగారుతో పిట్టల్లా కాల్చి చంపడమే కాకుండా, అక్రమ కేసులు బనాయించి జీవిత ఖైదీలు వేస్తున్నారని మండ పడ్డారు. ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని దేశంలో ప్రత్యామ్నాయ పార్టీ ఏదైనా ఉందంటే కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 2014లో ఎన్నికల మ్యానిఫెస్టోలో దేశంలోని ప్రతి కుటుంబానికి రూ. 15లక్షలు, ధరలు తగ్గించి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే కాకుండా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికి గద్దెనెక్కారన్నారు. దేశవ్యాప్తంగా రోజురోజుకు నిత్యవసర వస్తువులు గణనీయంగా పెరగడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రక్షణ రంగం వంటి సంస్థలకు నేడు ప్రైవేట్ పరం చేసిందని మండిపడ్డారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ మాట్లాడుతూ పాలగ ప్రభుత్వాలు పేద ప్రజలపై టాక్సీల పేరుతో పెనుబారం వేస్తుం డడంతో పేదలు మరింత పేదవాడిగా మారుతు న్నాడని ధ్వజమెత్తారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ళ పండుగకు ఎర్రజెండా పార్టీలు ఏకమై ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరవే యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, హుస్నాబాద్ సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, కార్యదర్శి పిల్లి రజినీ, ఎఐటీయుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, సిపిఐ హుస్నాబాద్ మండల సహాయ కార్యదర్శి పోదిల కుమారస్వామి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవ రెడ్డి, కొహెడ, అక్కన్నపేట, మండలాల కార్య దర్శులు వెల్పుల శ్రీనివాస్, కొమ్ముల భాస్కర్, సిపిఐ హుస్నాబాద్ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, పిట్టల మెగిలయ్య, పూదరి రఘుపతి, మౌటం బాలయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పట్టణ అధ్యక్షులు కాల్వల ఎల్లయ్య, ఎఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ దొంతరవేని రజిత, సిపిఐ అనుబంధ సంఘం తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి : హరీశ్‌రావు

విశాలాంధ్ర- కేసముద్రం: జిల్లాలోని కేసముద్రం మార్కెట్ యార్డ్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కేసముద్రం మార్కెట్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత వడ్లకు రూ.1400 కోట్ల బకాయిలు చెల్లించలేదని అంతేకాకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిన మక్కకు ఒక రూపాయి ప్రభుత్వం చెల్లించలేదు. తక్షణమే వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డబ్బులు రైతులకు చెల్లించాలన్నారు. గత యాసంగికి సంబంధించిన బోనస్ రూ.1100 కోట్లు వెంటనే విడుదల చేయాలని తెలిపారు. రైతుబంధు ఇవ్వలేదు. రుణమాఫీ పూర్తి చేయలేదు, పంట బీమా లేదు. కరెంటు లేదు. నీళ్లు లేవు ఆరోపించారు. రైతులుకేసముద్రం వ్యవసాయ మార్కెట్లో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని, రోజుల తరబడి ఇక్కడే వేచి ఉంటున్నా కనీస సౌకర్యాలు లేవని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావుకు రైతులు తెలియజేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హడావిడిగా జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో మీటింగ్‌పెట్టి సమస్య పరిష్కరించి రేపటి నుంచి పత్తి కొంటామన్నారు. ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కదులుతే తప్ప అధికార పార్టీలో కదలిక రాలేదన్నారు. వరదలో వల్ల జిల్లాలో అనేకరోడ్లు తెగిపోయాయి. మహబూబాబాద్ సీతారామ తండాలో కొత్త ఇళ్లు కట్టిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు.అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటకు ఎకరానికి 10,000 ఇస్తానని వరంగల్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పారు. నెరవేర్చలేదన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యేదయాకర్‌రావు, రెడ్యానాయక్ కోరినందుకు మహబూబాబాద్‌లో వంద పడకల ప్రభుత్వాసుపత్రిని బీఆర్ఎస్ సమయంలో మంజూరు చేశామని, కాంగ్రెస్ పాలనలో వాటి పురోగతి లేదన్నారు. అసెంబ్లీ పెట్టి డిప్యూటీ స్పీకర్‌ని ఎన్నిక చేసే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదని తెలిపారు. మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, పత్తి రైతులకు అన్యాయం చేయొద్దని తెలిపారు. అనంతరం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తల్లిదండ్రులకు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత,ఎమ్మెల్సీ రవీందర్ రావు, నాయకులు రాకేష్ రెడ్డి, కుడితి మహేందర్ రెడ్డితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఐ శతవార్షికోత్సవాలపై విస్తృతంగా ప్రచారం

విశాలాంధ్ర-నేరేడు చర్ల: సీపీఐ పార్టీ వందవ వార్షికోత్సవాలకు ఈనెల రానున్న ప్రచార జాతకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో వివిధ రూపాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు. మంగళవారం వాల్ రేటింగ్ రాస్తున్న పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... కరపత్రాల ద్వారా వాల్ రేటింగ్‌ల ద్వారా కళారూపాల ద్వారా ప్రతి గ్రామంలోనూ సీపీఐ 100 వార్షికోత్సవ సభ యొక్క ఉద్దేశాన్ని లక్ష్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని, మారుమూల గ్రామాలకు, గిరిజన తండాల్లోడు పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేయాలని సిపి పార్టీ నాయకులు చేసిన త్యాగాలను ఈ తరం యువతకు పార్టీ ప్రజాసంఘాలలో వాళ్ల సభ్యులుగా చేర్చుకొని పార్టీ బలోపేతానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.2014 సంవత్సరంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు తప్పుడు ప్రచారం చేసిందని ముఖ్యంగా కుటుంబానికి రూ.15 లక్షల రూపాయలు ఇస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ధరలు తగ్గిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, లీటర్ పెట్రోల్ డీజిల్ రూ.50లకు అందిస్తామని ఇలాంటి ప్రజాకర్షణ నినాదాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ అవేవీ అమలు చేయకుండా దేశంలో ప్రజల మధ్య మతవిద్వేషాలు భావోద్వేగాల రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటుందని ఆరు దశాబ్దాలుగా ప్రజల కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ముఖ్యంగా ఎల్ఐసి బ్యాంకులు టెలికాం గనులు చివరికి రక్షణ రంగ పరిశ్రమలు సైతం ప్రైవేటీకరణ చేసేందుకు నడుంబిగించారని దేశ సంపదను అంబానీ, ఆదాని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని సంపన్నులు సంపన్నులుగా మారుతుంటే పేదలు మరింత పేదలుగా అవుతు న్నారని రైతులను కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని వీటి రద్దు కొరకు సీపీఐ పోరాడుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను,, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమరాజు వెంకట్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ బండి శ్రీనివాస్ ఎస్కే హాజరత్ వున్నారు.

జల్ సంచయ్-జన్ భాగీదారీ జాతీయ అవార్డు

విశాలాంధ్ర - కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు నీటి సంరక్షణలో సాధించిన విశేషఫలితాలకు గానూ ప్రతిష్టాత్మక 'జల్ సంచయ్-జన్ భాగీదారీ జాతీయ అవార్డు దక్కింది. జిల్లాలో జల సంరక్షణ కోసం కలెక్టర్ జితేష్ వీ పాటిల్ చేసిన కృషికి ఫలితం దక్కిందని అధికారులు, జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పటిల్ చేతుల మీదుగా కలెక్టర్, జిల్లా డీఆర్డీవో విద్యా చందన తో కలసి మంగళవారం ఈ అవార్డు ను న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వా మ్యం, శాఖల సమన్వయంతో 29,103 నీటి సంరక్షణ పనులు పూర్తి చేయడంతో కొత్తగూడెం జిల్లా జాతీయస్థాయి మూడో జోన్ కేటగిరీ-3లో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. ఈ విజయానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల నగదు బహుమతి కూడా ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణ కోసం ఉద్యమంగా మార్చిన ప్రజల భాగస్వా మ్యం, గ్రామస్థాయి సంస్థల చురుకుదనం, శాఖల సమన్వయం కారణంగానే ఈ జాతీయ అవార్డు సాధ్యమైందన్నారు. జల్ సంచయ్-జన్ భాగీదారీ కార్యక్రమం కేవలం ప్రభుత్వ ప్రాజెక్ట్ కాకుండా, నీటి విలువపై ప్రజల్లో అవగాహన పెంచిన సామూహిక జల సంరక్షణ ఉద్యమంగా మారిందని చెప్పారు. ముఖ్యంగా ఇంకుడు గుంతల త్రవ్వకాన్ని భారీ ఎత్తున చేపట్టడం ద్వారా వర్షపు నీరు వృథాగా కాకుండా భూగర్భ జలాలుగా మారేందుకు దోహద పడిందన్నారు. భవిష్యత్తులో కూడా చెరువుల పునరుద్ధరణ, వాగుల అభివృద్ధి, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ అన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర ఖమ్మం : కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం డిఆర్ఓకి, ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ లకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దుసరి శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ.13 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, ఆధునికరణ వన పెంపకానికి పది ఎకరాల భూమిని కేటాయించాలని వారు పేర్కొన్నారు. గీత వృత్తిదారులందరికీ సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలోని గీత సహకార సంఘాలన్నిటికీ సహకారం అందించాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలనిఅమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా నాయకులు చేబ్రోలు ఇంద్రసేన, పరికపల్లి శ్రీను, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. అత్యంత నాణ్యత ప్రమాణాలతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం చివరి దశలో ఉందని, ప్రసూతి, శిశు వైద్య విభాగాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మెదక్ పట్టణ శివారులో మెడికల్ కళాశాల, క్రిటికల్ కేర్ సెంటర్, మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. మెడికల్ కళాశాలలో తరగతి గదులు, ల్యాబులు, డెమోరూమ్లు, లైబ్రరీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. మొదటి సం.లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. మెడికల్ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయని సూచించారు. వైద్య విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఈ నెలలోనే సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కావడంతో వారికి హాస్టల్ సదుపాయం, ప్రశాంత వాతావరణంలో తరగతులు, ప్రాక్టికల్స్, డెమోలు నిర్వహించి ఉన్నత వైద్య విద్యార్థులుగా తీర్చి దిద్దాలన్నారు. మెడికల్ కళాశాలలో ఏవైనా పెండింగ్ పనులుంటే వెంటనే పరిష్కరించలని అధికారు లను ఆదేశించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్ ను పరిశీలించారు. తొందరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్వో శ్రీరామ్ ,డిఎంహెచ్వో శ్రీరాం, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపరింటెండెంట్ సునీత, డిసిహెచ్ శివ దయాల్, ప్రొఫెసర్లు, ఆరోగ్య శాఖా అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తు

విశాలాంధ్ర తొర్రూరు: ఎస్సారెస్పీ కాలువ నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం భూసేకరణ చేపట్టగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆస్తులు జప్తు చేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని తొర్రూర్ ఆర్డీవో కార్యాలయ ఆస్తులను కోర్టు సిబ్బంది సమక్షంలో బాధిత రైతులు స్వాధీనపరచుకున్నారు. వివరాల్లోకి వెళితే.... ఎస్సారెస్పీ డిబిఎం 69 ఎల్ సాగునీటి కాలువ నిర్మాణానికై తొర్రూరు డివిజన్ పరిధిలోని దంతాలపల్లి మండలంలో 2009-10లో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఈ భూ సేకరణలో దంతాలపల్లికి చెందిన కొరిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సాధు ధర్మారెడ్డి, కొరిపల్లి వెంకన్న అనే రైతులు చెందిన 9 ఎకరాల విలువైన భూములు కోల్పోయారు. ప్రభుత్వం నామమాత్రంగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంది. భూములకు మార్కెట్ విలువ అధికంగా ఉండటంతో నష్టపోయామని భావించిన రైతులు 2011లో జిల్లా కోర్టును ఆశ్రయించారు. అప్పుడు ఆర్డీవో హైకోర్టుకు అప్పిలుకు వెళ్లారు. హైకోర్టు సదరు కేసును జిల్లా కోర్టుకు అప్పగించింది. జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం భూముల విలువ రూ.2.47 కోట్లు పరిహారం కింద రైతులకు చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ విషయమై ఆర్డీవో బేఖాతరు చేయడంతో అక్టోబర్ 8న తొర్రూర్ ఆర్డీవో కార్యాలయ ఆస్తులు జప్తు చేయాలని జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ తీర్పును వెలువరించారు. మంగళవారం బాధిత రైతులు న్యాయవాది కోర్టు సిబ్బంది సమక్షంలో తొర్రూరు ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని కార్యాలయంలోని కంప్యూటర్లు, టేబుళ్లు, ఫర్నిచర్ స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల జప్తులో న్యాయవాది నరేందర్, కోర్టు జూనియర్ అసిస్టెంట్ కళ్యాణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్, వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం మండలంలోని మూడుపూగల్, అయోధ్య,ఆమనగల్, ఐకెపి, సహకార శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు ,టెంట్స్, కుర్చీలు, సదుపాయాలు కల్పించాలని అన్నారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లు కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలని,కొనుగోళ్లు చేసి వెంట వెంటనే తరలించాలని, వాతావరణ మార్పు లు తదితర అంశాలపై రైతులకు సమాచారం అందిం చాలని తెలిపారు. కేంద్రాలలో గన్ని సంచులు, తార్పాలిన్లు, మ్యాచ్చర్ మిషన్, ప్యాడీ క్లీనర్స్, వేయింగ్ మిషన్స్ అందుబాటులో ఉంచాలన్నారు.ప్రత్యేక అధికారులు, అన్ని కేంద్రాలను పరిచిలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏ శ్రీవాసరావు, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఏవో తిరుపతి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రామగుండం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం రామగుండం మున్సిపల్ కార్యాలయంలో కార్పొరేషన్ పని తీరుపై ఆయన అదనపు కలెక్టర్ అరుణ శ్రీ (లోకల్ బాడీస్)తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నగరంలో టీ.యూ.ఐ.డి.ఎఫ్ క్రింద ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పనులు నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దిష్ట లక్ష్యం ప్రకారం 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ సకాలంలో రెన్యువల్ అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని,రోడ్డుపై ఒక ప్లాస్టిక్ కవర్ కూడా ఉండటానికి వీలు లేదని,చెత్త సేకరణ సరైన షెడ్యూల్ ప్రకారం జరగాలని అన్నారు. ఈ సమావేశంలో ఈఈ మున్సిపల్ రామన్ పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అన్ని గ్రామాల్లోనూ రోడ్లు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు . మంగళవారం ఆయన పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గూడూరు పాడు గ్రామ అభివృద్ధికి 8 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేశామని అన్నారు. గూడూరు పాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గూడూరు పాడు నుండి ఆకేరు వయా శ్మశానవాటిక వరకు రూ.కోటి 10 లక్షలతో, ఎం.వి.పాలెం - గూడూరు పాడు రోడ్డు నుంచి గూడూరు పాడు చెరువు అలుగు వరకు 3 కోట్ల 30 లక్షలతో నిర్మించనున్న బి.టీ. రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు. గూడూరు పాడు నుండి గొర్లపాడు వరకు 2 కోట్ల 97 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గూడూరు పాడు గ్రామానికి అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం కోసం రూ.35 లక్షలు, ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి 21 లక్షల రూపాయలు, త్రాగునీటి కోసం రూ.7 లక్షల మంజూరు చేశాన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గూడూరు పాడు గ్రామానికి 8 కోట్ల 50 లక్షలు అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. పేదల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ నరసింహా రావు, ఎంపీడీఓ., ఆర్ అండ్ బి ఎస్ఈ. యాకోబు, ఆర్.డబ్ల్యు ఎస్., సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పొగమంచులో వాహన ప్రయాణం ప్రమాదకరం

విశాలాంధ్ర ఖమ్మం (క్రైమ్) :దట్టమైన పొగమంచు సమయాల్లో వాహన ప్రయాణం ప్రమాదకరమని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నివారించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పొగమంచు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల దృష్టిలో పెట్టుకొని స్వల్ప నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని,పొగమంచు కారణంగా రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనదారులు పాదచారులను గమనించే సామర్థ్యం గణ నీయంగా తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వాహనాలను వేగంగా నడపకూడదని, ముందుగా వాహన పరిస్థితిని తనిఖీ చేసుకోవాలని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం, అనుకోకుండా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు వంటి ప్రమాదకర చర్యలు పూర్తిగా నివారించాలని సూచించారు.

సంపాదకీయం

బీహార్‌లో ప్రతిపక్ష ఓటమి తరవాత

బీహార్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ)లో తీవ్ర అంతర్మథనానికి అవకాశం కలిగించాల్సిన తరుణం. కానీ కాంగ్రెస్‌లో ఈ ఆత్మపరిశీలన ఏ మేరకు జరుగుతోందన్నది అనుమానాస్పదంగా ఉంది. బీహార్ ఎన్నికల ఫలితాల ఆధారంగా చూస్తే ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కడానికి అవకాశం ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరవాత ఆర్‌జేడీలో అసమ్మతి చెలరేగుతోందన్న వార్తలు వస్తున్నాయి. బీహార్ ఎన్నికల ఫలితాలను గమనిస్తే కాంగ్రెస్ ఎన్నికలలో పోటీ చేసే విధానాన్నే మరిచిపోయినట్టు కనిపిస్తోంది. పైగా తనకు బలం లేక పోయినా ఎక్కువ స్థానాలకు పోటీ చేయడం, తరవాత కళ్లు తేలేయడం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, ఆర్‌జేడీ, ఇంకా కొన్ని పార్టీల ఓటమికి కారణాలు కేవలం ప్రధానమంత్రి మోదీ ఎన్నికల కళాకౌశలం మాత్రమే లేదు. మహాఘట్బంధన్ ఓడిపోతే విజేత ఎవరు అన్న ప్రశ్న ఉదయిస్తుంది. పైపైన చూస్తే బీజేపీ, జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) అన్న సమాధానం రాకతప్పదు. కానీ ఈ రెండు పార్టీల విజయం వెనక అసలు కారకుడు జ్ఞానేశ్‌కుమార్ మాత్రమే అని అంగీకరించక తప్పదు. ఈ నిర్ధారణకు రావడానికి కారణం ఏమిటంటే ఆర్‌జేడీ ఘోరంగా ఓడిపోయినా 2020 నాటి ఎన్నికలకన్నా ఈ సారి ఎక్కువ ఓట్లే వచ్చాయి. సమగ్ర, సునిశిత ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై వచ్చిన వివాదాలను జనం అంతగా పట్టించుకోలేదంటున్నారు. నిజమే కావచ్చు. అయితే ఎస్ఐఆర్ ప్రభావం మాత్రం గెలుపోటముల మీద స్పష్టంగానే ఉంది. ఎస్ఐఆర్‌పై తలెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ ఇంతవరకు సమాధానమే చెప్పలేదు. ఫలితాలను బట్టి చూస్తే ఎన్నికల కమిషన్ బీజేపీకు పరిచారికంగా పని చేసిందనడం అనుమానాలకు తావు లేని అంశమే. ఎన్నికల కమిషన్‌ను గుప్పెట్లో పెట్టుకుని బీజేపీ సాధించిన విజయాన్ని ప్రధాన మంత్రి మోదీ ఇది ప్రజాస్వామ్య విజయం అంటున్నారు. అన్ని పక్షాలకూ సమానావకాశాలు కల్పించకుండా ఏకపక్షంగా ఎన్నికల కమిషన్ వ్యవహరించడం ప్రజాస్వామ్య విజయం ఎలా అవుతుందో అంతు పట్టదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ మోదీ ప్రభుత్వానికి తాబేదారుగా మారినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందనడంకన్నా హాస్యాస్పదమైన అంశం ఏముంటుంది? ఈ నేపథ్యంలోనే మహాఘట్బంధన్, ముఖ్యంగా "ఇండియా" ఐక్య సంఘటనకు నాయకత్వ స్థానంలో ఉన్న కాంగ్రెస్ వ్యవహార సరళిని కూలంకషంగా పరిశీలించవలసిందే. ఎన్నికల్లో విజయం సాధించడానికి అధికారం వికేంద్రీకరించాలన్న మౌలిక సూత్రాన్ని కాంగ్రెస్ పట్టించుకోనే లేదు. కీలకమైన బీహార్ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ అవే పాత ముఖాలను ముందుకు తోసింది. ఎన్నికల సమయంలోనైనా కాంగ్రెస్ పరిశీలకులు అట్టడుగున పని చేస్తున్న కార్యకర్తలను సంప్రదించాల్సిన దాఖలాలే లేవు. పోలింగ్ కేంద్ర స్థాయి కార్యకర్తలు చేయవలసిన పని ఏమిటో నిర్దేశించిన పాపాన కూడా పోరు. నేల మీద కాలు ఆంచి పని చేయవలసిన అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించిన దాఖలాలే లేవు. సీట్ల పంపిణీ వ్యవహారంలో కాంగ్రెస్ తనకు శక్తి లేకపోయినా ఎక్కువ సీట్లు కావాలంటుంది కానీ వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రతిపక్ష ఐక్య సంఘటనను నడపాలనుకోలేదు. విమర్శలను వినిపించుకునే లక్షణం కాంగ్రెస్‌లో మాయమై పోయింది. బీహార్‌లో ప్రతిపక్షాల ఓటమే చర్చనీయాంశం కాదు. ఎస్ఐఆర్ దేశమంతటా జరగనుంది. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఏ పోరాటం చేసింది అన్నదే అసలు ప్రశ్న. ఇప్పుడు దిల్లీలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మహా ప్రదర్శన నిర్వహిస్తామంటున్నారు. మంచిదే కానీ అది వరద ఎత్తిపోయిన తరవాత ఆనకట్ట కట్టడం లాంటిదే. కాంగ్రెస్ వంశ పారంపర్య రాజకీయాలు నడుపుతున్నదన్న విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. కానీ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభావం, ఆ కుటుంబ నాయకత్వం కాంగ్రెస్‌కు ఎంత మేలు చేస్తోందో అంతే అపకారం కూడా చేస్తోంది. అందుకే కాంగ్రెస్‌లో భజనపరులు ఎప్పుడూ ఉంటున్నారు.

కాంగ్రెస్ చీలి పోతుంది అని మోదీ శపిస్తున్నారు. కాంగ్రెస్‌కు చీలికలు కొత్త కాదు. అనేక సార్లు చీలింది. కాంగ్రెస్‌ను ఐక్యంగా ఉంచే శక్తి కూడా ఆ కుటుంబానికే ఉంటుంది. ఇదివరకు హర్యానా, మహారాష్ట్రలో ప్రతిపక్షాలు గెలుస్తాయన్న అంచనా తప్పింది. కానీ బీహార్‌లో ఎదురైన ఓటమి విచలితం చేస్తోంది. బీహార్ ఓటమి చూస్తే ప్రతిపక్షాలు పోరాట స్ఫూర్తిని సంపూర్ణంగా కోల్పోయాయేమో అనిపిస్తోంది. ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం నిర్వీర్యం అవుతుంది. ఎన్డీయే మొత్తం 243 స్థానాలలో 202 సీట్లు సంపాదించడమే ఆశ్చర్యకరం. కానీ బీజేపీ పక్షాన నిలిచిన లోక్‌జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ ఎన్డీయే పెట్టుకున్న లక్ష్యం 225 స్థానాలు అంటున్నారు. ఈ ఆశాభావం ఫలితాలు ప్రకటించక ముందు ఎక్కడా వినిపించనే లేదు. అది జరిగితే ప్రతిపక్షాలకు మిగిలేది కేవలం 18 సీట్లే. అంటే ప్రతిపక్షాన్ని తుడిచిపెట్టడమే బీజేపీ లక్ష్యం అయితే ఇక ప్రజాస్వామ్యం చిరునామా కూడా మిగలదు. ఎవరు గొంతెత్తి మాట్లాడే అవకాశమే ఉండదు. అలాంటి పరిస్థితే ఉంటే అది ప్రజాస్వామ్యం కాకుండా పోతుంది. ప్రతిపక్షాలు, కాంగ్రెస్ పని అయిపోయిందన్న వాదనలు కొనసాగుతున్నాయి. ఈ రెండూ సాధ్యమయ్యే పనులే కావు. ఎన్డీయే భారీ విజయం వెనక ఓటు చోరీ పాత్ర చాలా పెద్దదే. ఎన్నికలలో గౌరవప్రదమైన ఫలితాలు సాధించడం ఎంత అవసరమో అలాంటి గెలుపు అందకుండా చేసే కుట్రలను ఎదుర్కోవడం అంతకన్నా ఎక్కువ అవసరం. కాంగ్రెస్ చీలుతుంది అని మోదీ అనడం బీజేపీ కోసమో, ఎన్డీయే కోసమో కాదు. చీలిక భయం కల్గించి కాంగ్రెస్ నాయకులను ఆయన హెచ్చరించదలుచుకున్నారు. ఆయన చూపిస్తున్న భూతం వల్ల కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరడానికి ఆహ్వానమూ కావొచ్చు. కాంగ్రెస్‌ను మోదీ పరాన్నజీవి అని కూడా అన్నారు. తన మిత్రపక్షాల ఓట్లను మింగేస్తుంది అని కూడా మోదీ ఆరోపించారు. కానీ బీహార్‌లో ఇలాంటి చాయలే కనిపించలేదు. కాంగ్రెస్ ముస్లిం, మావోయిస్టుల పార్టీ అని మోదీ కొత్త పేరు కూడా పెట్టారు. కాంగ్రెస్‌లో పదవులలో ఉన్న వారు కూడా కాంగ్రెస్ ఎటు వేపు పయనిస్తోంది అన్న అనుమానం కూడా ఉంది అని మోదీ అన్నారు. కాంగ్రెస్ తన విలోమ రాజకీయాల వల్ల మిత్రపక్షాలను ముంచేస్తోందని కూడా మోదీ చెప్పారు. బీహార్‌లో ప్రతిపక్షాల ఓటమి దిగ్భ్రాంతి కలిగించేదే కావొచ్చు. ఒక రకంగా ఇది ప్రతిపక్షాలకు గుణపాఠం నేర్చుకునే అవకాశం కూడా కల్పించింది. ప్రతిపక్షాలు జాగరూకం కావడానికి ఈ ఓటమి మహత్తర అవకాశం కూడా. నిజానికి బీహార్‌లో ప్రతిపక్షాల అపజయం మోదీకి ఆనందకరంగా ఉన్నట్టు లేదు. ఆయనలో భయం పెరిగినట్టు ఉంది. ఈ అవకాశాన్ని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఏ మేరకు ఉపయోగించుకుంటాయో చూడాలి.

పైరసీ భూతం!

ఐ-బొమ్మ కథ ముగిసింది! బప్పం టీవీ సైతం బందయింది! సినిమాను ఉచితంగా చూసే ప్రేక్షకుడికి, వీక్షకుడికి ఇది కేవలం సంచలనం మాత్రమే కావచ్చు. కానీ లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌తో నడిచే చలనచిత్ర పరిశ్రమకు మాత్రం ఇదొక పెద్ద ఉపశమనం. ఉచితంగా సినిమాను అందిస్తామని చెపుతూ ఈమెయిల్స్, చిరునామాలు, ఆధార్‌కార్డులు, పాన్‌లు, ఫోన్ నెంబర్లు, ఇతరత్రా డేటాను నొక్కేసిన ఒక పెద్ద కుంభకోణ ధీరుడిని తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేయడమే కాకుండా, పైరసీతో వేల కోట్లను మింగేసి, దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతూ, సవాళ్లు చేస్తున్న ఈ-స్కామర్ ఇమ్మడి రవితోనే ఆ వెబ్‌సైట్లన్నింటినీ మూయించివేయడం విశేషం. చిరంజీవి నుంచి రాజమౌళి వరకు, టాలీవుడ్ నుంచి బాలీవుడ్, హాలీవుడ్ వరకూ సినీ ప్రముఖులంతా తెలంగాణ పోలీసులను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఐబొమ్మ నేపథ్యమే ఓ సినిమా. విశాఖపట్నానికి చెందిన ఇమ్మడి రవి రహస్యంగా ఐబొమ్మ పేరుతో వెబ్‌సైట్ కార్యకలాపాలు మొదలుపెట్టి, సినీ పరిశ్రమకు సవాల్ విసిరిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. కొత్త సినిమాను విడుదలైన రోజునే దొంగచాటుగా థియేటర్లలో వీడియో తీయించడం, వాటిని వెంటనే ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం చేస్తుండేవాడు. ఓటీటీలో విడుదలైన సినిమాలను సైతం హెచ్‌డీ ప్రింట్‌తో ఐబొమ్మలో అప్‌లోడ్ చేసేవాడు. ఐబొమ్మ దెబ్బకు సినీ నిర్మాతలు, ఓటీటీ సంస్థలు తీవ్రంగా నష్టపోయేవి. 'మమ్మల్ని ఆపలేరు, వెతకలేరు' అంటూ పోలీసులకే సవాల్ విసిరిన ఐబొమ్మ అధినేత కార్యకలాపాల పట్ల పోలీసుల నిఘా పెరగడంతో అతను బప్పం టీవీ పేరుతో మరో ఖాతా తెరిచి తన పైరసీ చక్రాన్ని తిప్పాడు. ఎట్టకేలకు తన సొంత ఇంట్లోనే పోలీసులకు చిక్కాడు.

భారతదేశంలో కాపీరైట్ మేధో సంపత్తి హక్కులను రక్షించడానికి అనేక చట్టాలు ఉన్నా, అవేవీ సత్ఫలితాలను ఇచ్చిన దాఖలాలు లేవు. కాపీరైట్ చట్టం-1957 పైరసీని ఎదుర్కోవడానికి, కాపీరైట్ ఉల్లంఘనలను శిక్షించడానికి ఉద్దేశించిన ప్రధాన చట్టం. ఇది సాహిత్యం, సంగీతం, సినిమాటోగ్రఫీ చిత్రాలు, సౌండ్ రికార్డింగ్‌లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కళాత్మక రచనలు మొదలైన వాటికి రక్షణ కల్పిస్తుంది. ఇలాంటిదే మరొకటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000. ఇంటర్నెట్, డిజిటల్ మాధ్యమాల ద్వారా జరిగే పైరసీని (ఉదాహరణకు, సినిమాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం లేదా పంపిణీ చేయడం) ఎదుర్కోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. ఇది సైబర్ నేరాలు, ఎలక్ట్రానిక్ డేటా దుర్వినియోగానికి సంబంధించిన అంశాలను కూడా కవర్ చేస్తుంది. మూడోది ట్రేడ్‌మార్క్స్ చట్టం-1999. పైరసీ అనేది తరచుగా నకిలీ వస్తువుల తయారీతో ముడిపడి ఉంటుంది కాబట్టి, ఈ చట్టం ట్రేడ్‌మార్క్‌లను రక్షించడంతోపాటు బ్రాండెడ్ ఉత్పత్తులను నకిలీ చేయకుండా నిరోధిస్తుంది. భారతదేశంలో పైరసీ అనేది ముఖ్యంగా ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా చాలా

విస్తృతంగా, విశృంఖలంగా ఉండటం ప్రమాదకర హేతువే. ఈ సమస్య వలన వివిధ పరిశ్రమలు ఏటా వేల కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూస్తున్నాయి. మొబైల్ ఇంటర్నెట్ వినియోగం పెరగడం, అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్‌లు లభించడం వలన పైరసీ కంటెంట్ వినియోగం గ్రామీణ ప్రాంతాలకు కూడా వేగంగా విస్తరించడం బాధాకరం. చలనచిత్ర పరిశ్రమ, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు అతి పెద్దగా నష్టపోయి, పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నాయి. సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి వస్తున్నాయి. నిజానికి పైరసీ కేవలం సినిమాలకే పరిమితం కాదు. ఇది అనేక ఇతర రంగాలకు విస్తరించి, అనేక రకాల డేటాను, మేధో సంపత్తిని దొంగిలిస్తోంది. పైరసీకి బలవుతున్న డేటాలో చలనచిత్రాలు, ఓటీటీలో కొత్తగా విడుదలైన సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షోలు, సంగీతం, ఆడియో ఫైల్స్, కొత్త పాటలు, ఆల్బమ్‌లు, ఈ-పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఆన్‌లైన్ కోర్సు మెటీరియల్స్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో ఆపరేటింగ్ సిస్టమ్స్, ప్రొఫెషనల్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లు, గేమింగ్ సాఫ్ట్‌వేర్‌లు, నకిలీ వస్తువుల జాబితాలో బ్రాండెడ్ దుస్తులు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్ (మందులు), గేమింగ్ విభాగంలో వీడియో గేమ్ ఫైల్స్, క్రాక్డ్ వెర్షన్స్ ఇలా ఒకటేమిటి పైరసీకి కావేవీ అనర్హమన్నట్లుగా అన్నీ ఉన్నాయి. పైరసీని పరిష్కరించడానికి చట్టాలు ఉన్నప్పటికీ, డిజిటల్ యుగంలో అమలు చేయడం ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయిందంటే ఆశ్చర్యకరమే.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో సాఫ్ట్‌వేర్ పైరసీ ఉన్న దేశాలలో ఒకటి. లైసెన్స్ లేని లేదా నకిలీ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం ఇక్కడ ఒక సాధారణ విషయంగా మారిపోయింది. బిజినెస్ సాఫ్ట్‌వేర్ అలయన్స్ వంటి అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం, భారతదేశంలో వినియోగించే సాఫ్ట్‌వేర్‌లో గణనీయమైన శాతం (కొన్ని అంచనాల ప్రకారం 50% పైగా) లైసెన్స్ లేనిదే. ఆపరేటింగ్ సిస్టమ్‌లు మొదలుకొని ప్రొఫెషనల్ డిజైన్, ఎడిటింగ్ టూల్స్, ఆఫీస్ ప్రొడక్టివిటీ సూట్లు వరకూ అన్నీ పైరసీ ఉత్పత్తులే. అందుకే కాపీరైట్, ఐటీ చట్టాలు ఉన్నప్పటికీ, నిష్ఫలమవుతున్నాయి. కాకపోతే, పోలీసు వ్యవస్థను పటిష్టపర్చడం, బలమైన సివిల్, క్రిమినల్ దావాలు వేయడం, యాంటీ-పైరసీ ప్రచారాలను నిర్వహించడం, సంస్థాగత పైరసీపై నిఘా ఉంచడం వంటి చర్యల ద్వారా పైరసీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా, అది చాలటం లేదని ఐబొమ్మ ఉదంతాలే చెపుతున్నాయి. పైరసీ వెబ్‌సైట్లను తరచుగా విదేశీ సర్వర్లలో హోస్ట్ చేయడం, వెబ్‌సైట్‌లను అత్యంత సులభంగా మార్చడానికి అవకాశం ఉండటం అతిపెద్ద సవాల్‌గా పరిణమించిన నేపథ్యంలో అంతర్జాతీయ చట్ట పరిధి ఉండాల్సిన ఆవశ్యకతను ఇది తెలియజేస్తున్నది. కోర్టు ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయాలని ఆదేశించినప్పుడు, ఆ వెబ్‌సైట్ సృష్టించే అన్ని కొత్త మిర్రర్ వెబ్‌సైట్‌లను కూడా ఆటోమేటిక్‌గా బ్లాక్ చేయడానికి అవకాశం ఉండేలా న్యాయస్థానాలు ఈమధ్య 'డైనమిక్ ఇంజక్షన్లు' జారీ చేయడం కొంతమేరకు ఉపయుక్తమూ, శుభపరిణామమూ. టొరెంట్స్ వంటి పీర్-టు-పీర్ నెట్‌వర్క్‌లలో ఒక ఫైలును ఒకే సర్వర్ నుంచి కాకుండా అనేక మంది వినియోగదారుల నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే విధానాలపై నియంత్రణ అసాధ్యమని పోలీసులు చెపుతున్నప్పటికీ, నిరంతర టెక్నాలజీ, చట్టపరమైన వ్యూహాలను మెరుగుపర్చుకోవడం ద్వారా పైరసీని అడ్డుకుంటే, అందరికీ శ్రేయస్కరం.

బంగ్లాదేశ్ రాజకీయ స్థిరత్వంపై ప్రశ్నలు

షాయిస్తా ఖానుమ్ పఠాన్

బంగ్లాదేశ్ ఉక్కు మహిళగా పేరుగాంచిన షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇవ్వడం ఆ దేశ రాజకీయాల్లో ఓ సంచలనంగా మారింది. దాదాపు రెండు దశాబ్దాలు బంగ్లాదేశ్‌ను ఆమె పాలించారు. ప్రపంచంలోనే అధిక కాలం పనిచేసిన మహిళా అధినేతల్లో ఒకరిగా నిలిచారు. అభిమానులు ఆమెను దేశాభివృద్ధికి నిర్మాతగా భావిస్తే... విమర్శకులు మాత్రం అధికారదాహంతో కూడిన నిరంకుశ పాలకురాలిగా విమర్శిస్తారు. గతేడాది బంగ్లాదేశ్‌లో జెన్ జీ ఆందోళన పెద్ద ఎత్తున జరిగింది. విద్యార్థుల తిరుగుబాటు క్రమంలో షేక్ హసీనా అధికారాన్ని కోల్పోయారు. దేశాన్ని వీడారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

యుద్ధ నేరస్థుల విచారణ కోసం షేక్ హసీనా నాడు స్థాపించిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) ఇప్పుడు ఆమెను మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన దోషిగా తేల్చడం చర్చనీయాంశంగా మారింది. షేక్ హసీనాకు న్యాయస్థానం మరణశిక్ష విధించడం దుమారం రేపింది. ఈ పరిణామం బంగ్లాదేశ్ రాజకీయ, న్యాయ, సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశముంది. తనకు మరణశిక్ష విధించడంపై షేక్ హసీనా తీవ్రంగా స్పందించారు. తన గైర్హాజరీలో విచారణ జరిపి శిక్ష విధించడంపై అభ్యంతరం తెలిపారు. ఇది రాజకీయ ప్రేరేపితం, పక్షపాతపూరితమంటూ తీర్పును ఖండించారు. మరణశిక్ష విధించడం...అవామీలీగ్‌ను రాజకీయంగా నిర్మూలించే మార్గంగా హసీనా అన్నారు. సాక్ష్యాలను న్యాయంగా పరిశీలించి, విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తనపై ఆరోపణలు చేసిన వారిని ఎదుర్కొనేందుకు భయం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని యూనస్ ప్రభుత్వాన్ని సవాల్ చేశారు. మానవ హక్కులు, అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వ రికార్డు గర్వకారణమని హసీనా వెల్లడించారు. వచ్చే ఏడాది బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో షేక్ హసీనాకు మరణశిక్షపడటం కీలకంగా మారింది. తాజా పరిణామాలు అక్కడ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే షేక్ హసీనా అనుకూల వర్గం ఆందోళనలకు దిగింది.

హసీనా వ్యవహారంలో భారత్ జాగ్రత్తగా వ్యవహరించింది. సహకారపూర్వకంగా వ్యవహరించాలనే రీతిలో తాజా తీర్పుపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఎందుకంటే బంగ్లాదేశ్, భారత్‌కు ఇందిరాగాంధీ కాలం నుంచే సత్సంబంధాలు ఉన్నాయి. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా షేక్ హసీనా మన దేశంలో ఆశ్రయం పొందారు. ఆమె ఆరేళ్లు ఇక్కడే ఉన్నారు. 1981 మేలో మళ్లీ బంగ్లాదేశ్‌లో అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఉన్నారు కాబట్టి ఈ తీర్పు దృష్ట్యా షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలంటూ భారత్‌పై దౌత్యపరంగా ఒత్తిడి పెరిగే అవకాశముంది. సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన నాయకురాలికి మరణ శిక్ష విధించడమేనది సుస్థిర రాజకీయ వ్యవస్థపై ప్రశ్నలకు దారితీస్తోంది. మానవ హక్కుల సంఘాలు సైతం ఈ తీర్పుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ న్యాయ ప్రమాణాలకు సంబంధించి బంగ్లాదేశ్‌పై ఒత్తిడి పెంచేందుకు ఈ తీర్పు అవకాశం ఇస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఐక్యరాజ్యసమితి సైతం అభ్యంతరం తెలిపింది. ఈ తీర్పు వెలువడినప్పుడు కోర్టులో కొందరు హర్షం వ్యక్తం చేశారు. అక్కడ సంబరాలు కూడా జరిగాయి. కాగా, షేక్ హసీనా ప్రభుత్వం గతంలో తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నది. నిరంకుశత్వ ప్రభుత్వంగా పేరుపొందింది.

బంగ్లాదేశ్ రాజకీయాలలో షేక్ హసీనా చక్రం తిప్పారు. గత మూడు దశాబ్దాలకు పైగా షేక్ హసీనా, ఆమె రాజకీయ ప్రత్యర్థి ఖలీదా జియా (బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భార్య) మధ్య పోరాటాల చుట్టూ బంగ్లాదేశ్ రాజకీయాలు తిరిగాయి. ఈ ఇద్దరు 'ది బ్యాట్లింగ్ బేగమ్స్'గా పేరుగాంచారు. హసీనా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. 1996లో తొలిసారి బంగ్లాదేశ్ ప్రధానమంత్రి అయ్యారు. 2001లో అధికారానికి దూరమైన ఆమె 2008లో భారీ మెజారిటీ సాధించారు. అప్పటి నుంచి తిరుగులేని నేతగా నిలిచారు. 2014, 2018 ఎన్నికల్లో సాధించిన వరుస విజయాలతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం పనిచేసిన మహిళా నేతగా చరిత్రకెక్కారు. కాగా జెన్ జీ ఆందోళనలతో ఆమె రాజకీయ ప్రస్థానానికి ముగింపు పలికినట్లు అయింది. 2024 జులై 15 నుంచి ఆగస్టు 15 వ తేదీ మధ్య జరిగిన ప్రభుత్వ అణచివేతలో 1,400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. దీంతో మానవత్వానికి వ్యతిరేకమైన ఈ నేరాలకు షేక్ హసీనాకు తాజాగా మరణశిక్ష పడింది.

షేక్ హసీనాకు మరణ శిక్ష విధిస్తూ వెలువడిన తీర్పు బంగ్లాదేశ్ రాజకీయాల్లో గమనించదగిన ఘటన మాత్రమే కాదు. దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక అంశం కూడా. ఇది న్యాయ వ్యవస్థపై ఉన్న విశ్వాసం, రాజకీయ శక్తి సమీకరణాలు, అంతర్జాతీయ సంబంధాలపై చర్చకు దారితీసింది. తీర్పు తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వంపై ప్రశ్నలు తలెత్తాయి. తీర్పు ప్రభావం మారుతున్న ప్రపంచ రాజకీయ పరిస్థితులు, అభిప్రాయాలు, బంగ్లాదేశ్‌లో అమలు కాబోయే సంస్కరణలపై తీవ్రంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యం, న్యాయసంస్థల స్థిరత్వం, అంతర్జాతీయ వ్యూహాత్మక సంబంధాలకు ఇది అగ్నిపరీక్షగా మారవచ్చని కొందరు విశ్లేషకులు అంటున్నారు. భవిష్యత్తులో రాజకీయ శక్తుల పరస్పర పోరాటానికి కొత్త ప్రతీకగా నిలిచే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఈ తీర్పును రాజకీయ ప్రతీకారంగా కొందరు ఖండిస్తే... మరికొందరు న్యాయం జరిగిందన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు మరణశిక్షపై చర్చిస్తున్నాయి. మోసపూరితమైన తీర్పుగా ఐరాస పేర్కొంది. ఈ తీర్పు ఒక వ్యక్తి భవిష్యత్తును నిర్ణయించడమే కాకుండా బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య వ్యవస్థ, న్యాయ సూత్రాలు, అంతర్జాతీయ ప్రతిష్టపై దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామం కావచ్చన్న అభిప్రాయం ఉంది. షేక్ హసీనాకు మరణ శిక్ష పడటంతో బంగ్లాదేశ్ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఏళ్ల తరబడి కొనసాగిన అధికారవాదానికి జవాబుదారీతనం తీసుకురావాలంటే ఇదే మార్గమని ఓ వర్గం అంటుంటే... మరణశిక్ష న్యాయాన్ని దెబ్బతీస్తుందన్నది మరో వర్గం వాదన. దేశంలో జాతీయ ఐక్యత అత్యవసరమని కూడా నొక్కి చెబుతోంది. బంగ్లాదేశ్ చరిత్ర దృష్ట్యా భవిష్యత్తులో అనూహ్యమైన పరిణామాలు అనేకం ఉండబోతున్న సంకేతాలు ఉన్నాయి. పొరుగు దేశాల దృష్టిలో బంగ్లాదేశ్‌లోని అస్థిరత వ్యూహాత్మకంగా కీలకం. ఏదిఏమైనా దక్షిణాసియా ప్రాంతీయ రాజకీయాలపై దీని ప్రభావం ఉండనున్నది.

భయం నీడలో నాలుగో ప్రజాస్వామ్య స్తంభం!

కానూరి కృష్ణ

ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ఒక వజ్రాయుధం. అది పాలకులను నిలదీస్తుంది, ప్రజల గొంతుకను వినిపిస్తుంది, పారదర్శకతకు పునాది వేస్తుంది. కానీ నేటి భారతదేశంలో ఈ నాలుగో స్తంభం ఒక విషాదకరమైన నినాదాన్ని ప్రతిధ్వనిస్తోంది. 'స్వేచ్ఛ లేదు, భద్రత లేదు' సత్యాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలనే తపనతో పనిచేసే పాత్రికేయులకు ప్రతి అడుగు ఒక అగ్ని పరీక్షగా మారింది. పాలకుల ప్రయోజనాలు, కార్పొరేట్ దిగ్గజాల ఒత్తిళ్లు పత్రికా ధర్మాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. భిన్నంగా వెళ్లిన జర్నలిస్టులకు ఎదురవుతున్న వేధింపులు, చట్టపరమైన నిర్బంధాలు, చివరికి హత్యలు... ఇవన్నీ మన ప్రజాస్వామ్య వ్యవస్థలో నెలకొన్న అభద్రతా వాతావరణానికి అద్దం పడుతున్నాయి. రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్(ఆర్ఎస్ఎఫ్) ప్రచురించే ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారతదేశం స్థానం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2014 లో 140 వ స్థానంలో ఉన్న భారత్, 2023 నాటికి 161 వ స్థానానికి పడిపోయింది. 2024 లో స్వల్పంగా మెరుగుపడి 180 దేశాలలో 159 వ స్థానంలో నిలిచినప్పటికీ, ఇది పత్రికా స్వేచ్ఛ అత్యంత 'సమస్యాత్మకమైన' దేశాల జాబితాలోనే కొనసాగింది. పొరుగు దేశాలైన శ్రీలంక (150), పాకిస్థాన్ (152) కంటే మన ర్యాంక్ వెనుకబడి ఉండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది. పత్రికా స్వేచ్ఛ స్కోరు కూడా 2014లో 40.34 నుంచి 2024లో 31.28కి తగ్గింది. ఇది భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ స్థాయి 31% మాత్రమే అని సూచిస్తుంది.

జర్నలిస్టులు రిపోర్టింగ్ చేస్తున్నందుకు ప్రత్యక్షంగా శారీరక దాడులు, బెదిరింపులు హత్యలకు గురవుతున్నారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం లేదు. యునెస్కో, ఐక్యరాజ్య సమితి సూచనలు అమలు కావు. ది కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) వంటి సంస్థల ప్రకారం, 1992 నుంచి 2024 వరకు భారతదేశంలో అనేక మంది జర్నలిస్టులు వారి పనికి సంబంధించిన కారణాల వల్ల హత్యకు గురయ్యారు. 2000 నుంచి 2024 వరకు, కమిటీ టు సీపీజే ప్రకారం 75 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. వీరిలో 90% కేసుల్లో నేరస్థులకు శిక్షపడలేదు ఇండియా ప్రెస్ ఫ్రీడమ్ వార్షిక నివేదిక (2024) ప్రకారం, 2023లో దేశవ్యాప్తంగా ఐదుగురు జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. మొత్తం 226 మంది జర్నలిస్టులను ప్రభుత్వ సంస్థలు, సంఘ వ్యతిరేక శక్తులు, లేదా నేరస్తులు లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెట్టారు. ఉత్తరప్రదేశ్‌లో 16 హత్యలు, బీహార్‌లో 12, జార్ఖండ్‌లో మైనింగ్ మాఫియా (2015-2024) ఏడుగురు జర్నలిస్టులను హతమార్చింది. దక్షిణ భారతంలో (తమిళనాడు, కర్నాటక) 2024లో 8 హత్యలు జరిగాయి. వీటిలో చాలా ప్రభుత్వ కేసులలో అనుమతులతోనే దర్యాప్తు ఆగిపోయింది. ఇలాంటి ఆంక్షలు జర్నలిస్టులను సెల్ఫ్-సెన్సార్‌షిప్‌నకు బలవంతం చేస్తున్నాయి. ఇవి కేవలం గణాంకాలు కాదు, మన డెమోక్రసీ మీద దాడి. ఎక్కువ సందర్భాల్లో, జర్నలిస్టులపై నేరాలకు పాల్పడినవారిని శిక్షించలేదు. దండనారాహిత్యం' అంటే, నేరం చేసినా జర్నలిస్టులపై చేయి చేసుకున్నవారు నిర్భయంగా తిరిగే అవకాశం. ఇది కేవలం న్యాయం జరగకపోవడం కాదు. ప్రతి అభద్రతకు, ప్రతి బెదిరింపునకు భవిష్యత్తులో గ్యారంటీ ఇస్తున్నట్టుగా భావించి, నేరగాళ్లు మరింత తెగించేందుకు దారితీసే ప్రమాదకరమైన ధోరణి ఇది. సత్యం చెప్పే గొంతులు మూగబోతున్నాయి.

సత్యాలను వెలికితీసే స్వతంత్ర మీడియా సంస్థలు ఇప్పుడు ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్న కార్పొరేట్ సంస్థల చేతిలో బందీ అయ్యాయి. 80% జాతీయ మీడియా 5 పెద్ద కార్పొరేట్ గ్రూపుల చేతుల్లో ఉంది. మీడియా యాజమాన్యం కేంద్రీకృతం కావడం పత్రికా బహుళత్వానికి అతిపెద్ద ముప్పుగా పరిణమించింది. కొన్ని ప్రముఖ కార్పొరేట్ సంస్థలు దాదాపు అన్ని రకాల మీడియా (టీవీ, పత్రికలు, డిజిటల్)పై నియంత్రణ సాధించడం, స్వతంత్ర గొంతులను అణిచివేయడం చేస్తున్నాయి. పాలకులకు వ్యతిరేకంగా మాట్లాడే మీడియా సంస్థలపై ప్రకటనలను నిలిపివేసి ఆర్థికంగా దెబ్బతీయడం ఒక సాధారణ వ్యూహంగా మారింది. స్వతంత్ర వెబ్‌సైట్‌లు, ఛానెళ్లు ఈ ఒత్తిడికి తలొగ్గక తప్పడం లేదు. ఈడీ వంటి ప్రభుత్వ సంస్థల దాడులు, 'న్యూస్‌క్లిక్', 'బిబిసి ఇండియా' వంటి మీడియా సంస్థలపై ఆంక్షలు ఆర్థిక నియంత్రణకు పెద్ద ఉదాహరణలుగా నిలిచాయి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(ఎ)లో స్వేచ్ఛను హామీ ఇస్తుంది. కానీ వాస్తవంలో?. చట్టపరమైన నిర్బంధాలు, వేధింపులు పాలకులకు వ్యతిరేకంగా కథనాలు రాసినందుకు జర్నలిస్టులపై దేశద్రోహం , పరువు నష్టం, తీవ్రవాద నిరోధక చట్టాలు వంటి కఠినమైన చట్టాలను ప్రయోగించడం పెరుగుతోంది. చాలా రాష్ట్రాలలో, ముఖ్యంగా రాజకీయంగా సున్నితమైన అంశాలను రిపోర్ట్ చేసినందుకు జర్నలిస్టులను అరెస్టు చేయడం, వారి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకోవడం నిరాటంకంగా కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్‌లో సిద్దీఖ్ కప్పన్ వంటి జర్నలిస్టుల సుదీర్ఘ నిర్బంధం, రాణా అయ్యూబ్ వంటి వారిపై సైబర్ దాడులు, క్రిమినల్ కేసులు జర్నలిజంపై పెరిగిన చట్టపరమైన బెదిరింపులను సూచిస్తున్నాయి. యునెస్కో నివేదిక ప్రకారం ముఖ్యంగా మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్ వేధింపులు 2024లో 40% పెరిగింది. భిన్నాభిప్రాయం చెప్పిన వారిపై 'దేశ వ్యతిరేకి' అని ముద్రవేస్తారు. భయంతో, వణికిపోయి, పదాలను ఆలోచిస్తూ రాయాల్సిన పరిస్థితిని అడుగడుగునా ఎదుర్కొంటున్నారు.

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడానికి, అది కేవలం రాజ్యాంగంలోని ఒక వాగ్దానంగా మిగిలిపోకుండా, వాస్తవంగా ప్రజల గొంతుకగా నిలబడాలంటే, తక్షణమే ఒక సమగ్రమైన జర్నలిస్ట్ రక్షణ చట్టాన్ని రూపొందించాలి. ఈ చట్టం, సత్యాన్ని వెలికితీసే క్రమంలో జర్నలిస్టులపై జరిగే దాడులు, బెదిరింపులు, హత్యల కేసులను వేగంగా విచారించడానికి ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి, నేరస్తులకు శిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, ప్రభుత్వాలు ప్రకటనల ఉపసంహరణ లేదా చట్టపరమైన వేధింపుల ద్వారా స్వతంత్ర మీడియాను ఆర్థికంగా అణచివేయడాన్ని నిరోధించాలి. చివరగా, కార్పొరేట్ ఒత్తిడికి లొంగకుండా, ప్రజల ప్రయోజనాలే పరమావధిగా రిపోర్టింగ్ చేసే స్వతంత్ర మీడియా సంస్థలకు పౌర సమాజం, ప్రభుత్వం ఇద్దరూ అండగా నిలబడాలి. ఎందుకంటే, మీడియా భద్రత ప్రజల హక్కుల భద్రతతో ముడిపడి ఉంది. భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద అంతర్లీనంగా పౌరులకు లభించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే అయినా, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాలు లేకపోవడం, అధికార దుర్వినియోగం వల్ల వారికి భద్రత కరువైంది. ఒక జర్నలిస్ట్ స్వేచ్ఛగా, నిర్భయంగా సత్యాన్ని రాయలేనప్పుడు, ప్రజలకు నిజమైన సమాచారం అందదు. వారికి స్వేచ్ఛ లేకపోతే, భద్రత లేదు. పాలకులను, కార్పొరేట్ ప్రయోజనాలను ప్రశ్నించే పాత్రికేయుల గొంతు నొక్కితే, అది ప్రజాస్వామ్యానికి మరణశాసనం అవుతుంది. జర్నలిస్టుల భద్రతను, స్వేచ్ఛను పరిరక్షించడం కేవలం మీడియా సంస్థల బాధ్యత కాదు, అది దేశ పౌరులందరి సమిష్టి బాధ్యత. పత్రికా స్వేచ్ఛను గౌరవించి, దానిని కాపాడుకున్నప్పుడే మన ప్రజాస్వామ్యం పరిపూర్ణమవుతుంది.

మరఠ్వాడాలో రైతుల చావుకేక

- జనవరి-అక్టోబరు మధ్య 899 మంది ఆత్మహత్య
- ప్రకృతి ప్రకోపంతో పంటలకు తీవ్ర నష్టం
- పాలకుల అరకొర సాయం... దిక్కుతోచక అన్నదాతల బలవన్మరణం

ఛత్రపతి శంభాజీనగర్ (మహారాష్ట్ర): మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతం రైతుల చావు కేకలతో మార్మోగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 899 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు నెలల్లో వరదలు పంటలకు భారీ నష్టం కలిగించడంతో 537 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి ఆశిష్ జైస్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిష్కరిస్తోందని, ప్రత్యేక పథకాలు, ప్రోత్సాహకాలపై ఖర్చును లక్ష కోట్ల రూపాయలకు పెంచిందని చెప్పారు. ఛత్రపతి శంభాజీనగర్ డివిజనల్ కమిషనర్ కార్యాలయం వివరాల ప్రకారం... ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు పది నెలల్లో మరాఠ్వాడాలో 899 మంది రైతు ఆత్మహత్యలు నమోదయ్యాయి. వీటిలో వర్షాలు, వరదలు విధ్వంసం సృష్టించిన ఆరు నెలల్లో (మే 1 నుంచి అక్టోబరు 31 వరకు) 537 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బీడ్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాల్లో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. జిల్లాల వారీగా ఈ ఆరు నెలల్లో ఛత్రపతి శంభాజీనగర్‌లో 112 మంది, జల్నా 32, పర్భానీ 45, హింగోలి 33, నాందేడ్ 90, బీడ్ 108, లాతూర్ 47, ధరాశివ్ 70 ఆత్మహత్యలు నమోదయ్యాయి. మరాఠ్వాడాలో ఛత్రపతి శంభాజీనగర్, జల్నా, నాందేడ్, పర్భానీ, హింగోలి, లాతూర్, బీడ్, ధరాశివ్ జిల్లాలతో సహా బాధిత రైతులకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.32 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. అతి వర్షపాతం, వరదల కారణంగా సెప్టెంబరు 20 వరకు నమోదయిన సమాచారం ప్రకారం 12 మంది మరణించారు. దాదాపు 1,300 ఇళ్లు దెబ్బతినగా, 57 జంతువులు మరణించాయి. రైతు నాయకుడు, మాజీ ఎంపీ రాజు శెట్టి ఆత్మహత్యలపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అకాల వర్షం తరువాత వరదలు, దీర్ఘకాల రుతుపవనాలు పండ్ల తోటలు, పంటలను తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. 'ఈ సంఘటనల క్రమం నిస్సందేహంగా మరాఠ్వాడాలో రైతులను నిరాశపరిచింది' అని ఆయన తెలిపారు. పంటలకు జరిగిన నష్టానికి వ్యవసాయదారులకు స్వల్ప పరిహారం లభించిందని శెట్టి విమర్శించారు. 'అరటి తోట ఉన్న ఒక రైతు టన్నుకు రూ.25 వేల చొప్పున దాదాపు 100 టన్నుల పంటకు ఒక వ్యాపార వేత్తతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సినా నదిలో వరదలు అతని మొత్తం పంటను తుడిచిపెట్టేసిన తర్వాత అతనికి రూ.25 వేల పరిహారం మాత్రమే లభించింది. ఇలాంటి కేసులు చాలా ఉన్నాయి' అని ఆయన వివరించారు. మంత్రి ఆశిష్ జైస్వాల్ పీటీఐతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పథకాలు, ప్రోత్సాహకాల కోసం సుమారు రూ.1 లక్ష కోట్లు ఖర్చు చేస్తోందని, ఇది వ్యవసాయ శాఖ వార్షిక బడ్జెట్ అయిన రూ.23 వేల కోట్లకు మించిపోయిందని అన్నారు.

భవిష్యత్‌లో రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం పెరుగుతుందని ఆయన అన్నారు. 'మరాఠ్వాడాలో కనిపించే స్థాయిలో ప్రకృతి వైపరీత్యాలు పునరావృతం అయ్యే అవకాశం ఉన్నందున దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం. ప్రతిపాదిత చర్యలలో నియంత్రిత వ్యవసాయానికి మారడం, రైతులకు హామీ ఇవ్వబడిన రాబడిని ఇచ్చే పంట విధానాలను సవరించడం ఉన్నాయి' అని ఆయన అన్నారు. రుణ మాఫీ ప్రకటించినప్పుడు దాని ప్రయోజనాలు అవసరమైన వారికి చేరేలా చూసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. ఇంకా కౌన్సెలింగ్‌పై దృష్టి సారించిన రైతు సహాయ సంస్థ ప్రభుత్వానికి వ్యూహాత్మక, దీర్ఘకాలిక విపత్తు నిర్వహణ ప్రణాళికను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. కౌన్సెలింగ్ ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించడానికి అంకితమైన శివర్ హెల్ప్ లైన్ వ్యవస్థాపకుడు వినాయక్ హెగాన మాట్లాడుతూ విపత్తు నిర్వహణకు, వ్యూహాత్మక, దీర్ఘకాలిక విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'ప్రభుత్వం వాతావరణ మార్పుల నమూనాను గుర్తించి కోవిడ్-19 మహమ్మారి సమయంలో అమలు చేసిన మాదిరిగానే ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి.

రైతుల సమస్యలను తక్షణ, స్థానికీకరించిన ప్రాతిపదికన పరిష్కరించడానికి ఈ దళానికి అధికారం ఇవ్వాలి' అని ఆయన సూచించారు. మరాఠ్వాడాలో విపత్తు నిర్వహణ ప్రస్తుత ప్రమాణాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని, కొత్త చట్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

బీహార్ ప్రభుత్వ ఏర్పాటుపై మంతనాలు

బీజేపీ అధిష్ఠానంతో జేడీయూ నేతల భేటీ

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు ముందు... జేడీ(యూ) నాయకులు సంజయ్ ఝా, లాలన్ సింగ్ మంగళవారం ఇక్కడ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో కలిశారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ అంతరంగిక సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా పాల్గొన్నారు. బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీఏ సన్నాహాలు, ఎన్డీఏ నియోజకవర్గాలకు మంత్రివర్గ శాఖల కేటాయింపు, అసెంబ్లీ స్పీకర్ పదవికి అభ్యర్థి గురించి సమావేశంలో చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్... గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలిసి నవంబరు 19 నుంచి అమలులోకి వచ్చేలా అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేసిన తర్వాత బీహార్‌లో ఎన్డీఏ కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ సోమవారం ప్రారంభమయింది. జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ బుధవారం గవర్నర్‌ను మళ్లీ కలిసి తన రాజీనామాను ఎన్డీఏలోని అన్ని ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేల మద్దతు లేఖతో పాటు సమర్పించనున్నారు. పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రిగా రికార్డు స్థాయిలో 10వ సారి ప్రమాణ స్వీకారం చేయడానికి ఒక రోజు ముందు... నితీశ్ నవంబరు 19న శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికవుతారని జేడీ(యూ) వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కొత్త మంత్రివర్గంలోని ఇతర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు షా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్ సహా అనేక మంది ఎన్డీఏ నాయకులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు. గత వారం అధికార ఎన్డీఏ 243 మంది సభ్యులు గల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 202 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీని సాధించింది. బీజేపీ 89 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దాని మిత్రపక్షం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) 85 స్థానాలను గెలుచుకోగా, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 19 స్థానాలను గెలుచుకుంది. మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా (లౌకిక) ఐదు స్థానాలను గెలుచుకోగా, ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా నాలుగు స్థానాలను గెలుచుకుంది. అయితే ఇండియా ఐక్య సంఘటన 34 స్థానాల్లో విజయం సాధించగా... హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం ఐదు స్థానాలను, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ ఒక్కొక్క స్థానాన్ని దక్కించుకున్నాయి.

43 మంది నాయకులకు కాంగ్రెస్ షోకాజ్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్ మంగళవారం మాజీ మంత్రులు సహా 43 మంది నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ అధికారిక పంథాను తప్పుగా ప్రకటించినందుకు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ నాయకులకు షోకాజ్ నోటీసులు పంపినట్లు కాంగ్రెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ 43 మందిలో మాజీ మంత్రి వీణా షాహి, ఏఐసీసీ సభ్యుడు మధురేంద్ర కుమార్ సింగ్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కైసర్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ అజయ్ కుమార్ సింగ్ ఉన్నారు. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు కపిల్ దేవ్ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ నవంబరు 21 మధ్యాహ్నం నాటికి అందరు నాయకులు కమిటీ ముందు లిఖితపూర్వక వివరణను సమర్పించాలని ఆదేశించారు' అని అన్నారు. నిర్ణీత సమయంలో సమాధానం అందకపోతే, కమిటీ కఠినమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని, ఆరు సంవత్సరాల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరణ కూడా ఉంటుందని తెలిపింది. క్రమశిక్షణ, ఐక్యత పార్టీకి అధిక ప్రాధాన్యతలని, వీటిని దెబ్బతీసే ఏ చర్యను అయినా తీవ్రంగా పరిగణిస్తామని కమిటీ స్పష్టం చేసింది.

79 మంది బంగ్లాదేశ్ జాలర్ల అరెస్ట్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌కు చెందిన 79 మంది మత్స్యకారులను మూడు ఫిషింగ్ బోట్లను భారత తీర రక్షక దళం (ఐసీజీ) మంగళవారం స్వాధీనం చేసుకుంది. ఉత్తర బంగాళాఖాతంలో భారత దేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఈఈజెడ్)లోపల అక్రమంగా చేపలు పడుతున్నట్లు అధికారులు తెలిపారు. నవంబర్ 15,16 తేదీల మధ్య అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబీఎల్) వెంబడి నిఘా నిర్వహిస్తుండగా వారు పట్టుబడ్డారు. ఐసీజీ అందించిన వివరాల ప్రకారం గస్తీ బృందాలు భారత జలాల్లో బోట్లను గుర్తించాయి. ఇవి భారతదేశ సముద్ర మండలాల (విదేశీ నౌకల ద్వారా చేపలు పట్టడం నియంత్రణ) చట్టం,1981ని ఉల్లంఘించాయి. బోట్లను అడ్డగించి తనిఖీ చేయగా, సిబ్బంది చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపలేకపోయారు. మూడు బోట్లను, సిబ్బందిని ఫ్రేజర్ గంజ్‌కు తరలించి, తదుపరి చర్యల కోసం మెరైన్ పోలీసులకు అప్పగించారు.

అమిత్ షా డెడ్‌లైన్‌కు ముందే హిడ్మా ఎన్‌కౌంటర్

న్యూఢిల్లీ: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశారు. నవంబరు 30లోపు హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. '2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందాడు' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

జాగ్రత్తగా ఉండండి

ఇరాన్‌కు వెళ్లే వారికి కేంద్రం సలహా

న్యూఢిల్లీ: భారతీయులు వీసా అవసరం లేకుండా ఇరాన్‌లో ప్రయాణించే సదుపాయాన్ని నవంబర్ 22 నుంచి నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనిపై భారతీయులకు కేంద్ర ప్రభుత్వం సలహా ఇచ్చింది. ఇరాన్ వెళ్లాలనుకునేవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, దోపిడీలు, కిడ్నాప్‌ల బారిన పడొద్దని కేంద్ర విదేశాంగశాఖ సూచించింది. ఉపాధి కల్పిస్తామని తప్పుడు హామీలు ఇస్తూ ఇరాన్ నుంచి ఇతర దేశాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామనే ఏజెంట్లను నమ్మొద్దని హెచ్చరించింది. వారు క్రిమినల్ ముఠాలతో కుమ్మక్కై ఉండవచ్చని, అందువల్ల వారి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరింది. సాధారణ భారతీయ పౌరులు వీసా లేకుండా ఇరాన్‌లో ప్రయాణించడాన్ని నిలిపివేస్తూ జారీ చేసిన ఆదేశాలు ఈనెల 22 నుంచి అమలులోకి వస్తాయని ఆ దేశ విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది.

మహిళలకు రూ.10 వేలు ఇవ్వకుంటే

జేడీయూకు 25 లోపే సీట్లు

ఓట్ల చోరీ దేశవ్యాప్త సమస్య: ప్రశాంత్ కిశోర్

పట్నా : నితీశ్ కుమార్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలోని 60 వేల మందికి పైగా లబ్ధిదారులకు రూ.10 వేలు ఇవ్వకపోతే జేడీ(యూ) కేవలం 25 సీట్లకే పరిమితం అయ్యేదని జన్ సురాజ్ పార్టీ నాయకుడు ప్రశాంత్ కిశోర్ మంగళవారం అన్నారు. స్వయం ఉపాధి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1.5 కోట్ల మంది మహిళలకు రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల నుంచి రూ.40 వేల కోట్లు డబ్బును వాగ్దానం చేసిందని, ఎన్నికలకు ముందు దానిలో పెద్ద భాగాన్ని విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో కిశోర్ మాట్లాడుతూ తన జన్ సురాజ్ పార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి నిజాయితీగా ప్రయత్నించిందని, కానీ ఎన్నికల్లో తమ గుర్తింపును సాధించలేకపోయిందని, ఈ పరాజయానికి తాను పూర్తి బాధ్యత వహించానని అన్నారు. 'మా అభ్యర్థులు ఎవరూ అసెంబ్లీకి వెళ్లడం లేదు. ప్రజల మధ్యకు వెళ్లి పోరాటం చేయడమే మాకు ప్రజల ఆదేశం' అని తెలిపారు. ఒక ఆంగ్ల పదబంధాన్ని ఉటంకిస్తూ, 'మీరు రాజీనామా చేసే వరకు మీరు ఓడిపోరు' అని అన్నారు. 'మేము తప్పులు చేసి ఉండవచ్చు. కానీ విభజన రాజకీయాలు చేయడం, అమాయక ప్రజల ఓట్లను కొనుగోలు చేయడం అనే నేరం చేయలేదు' అని స్పష్టం చేశారు. 'ఓట్ చోరీ' (ఓట్ల దొంగతనం) అనేది దేశ వ్యాప్త సమస్య అని కిశోర్ ఆరోపించారు. జాతీయ ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంపై చర్చలు జరపాలని, అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయించాలని కోరారు. 'మాకు ఎదురుదెబ్బ తగిలింది. కానీ మేము తప్పులను సరిదిద్దుకుంటాము. మనల్ని మనం నిర్మించుకుంటాము. బలంగా తిరిగి వస్తాము... మాకు వెనక్కి తగ్గే అవకాశం లేదు' అని ఆయన తేల్చి చెప్పారు. బీహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారా అనే ప్రశ్నకు, 'అవును, కుల, మతపరంగా విభజించి డబ్బు ఉపయోగించి ప్రజల ఓట్లను కొనుగోలు చేసిన నితీశ్ కుమార్, బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి, ఇతరుల మాదిరిగా నేను బీహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాను' అని ప్రశాంత్ కిశోర్ వ్యంగంగా అన్నారు. 'ఓట్లు పొందకపోవడం నేరం కాదు... కనీసం నేను అవినీతి లేదా విభజన రాజకీయాలకు పాల్పడలేదు' అని ఆయన అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చి, స్వయం ఉపాధి కార్యక్రమాల కింద రూ.1.5 కోట్ల మంది మహిళలకు రూ.2 లక్షలు ఇస్తే తాను రాజకీయాలను 'కచ్చితంగా వదులుకుంటానని' కిశోర్ అన్నారు. జేడీ(యూ) 25 కంటే ఎక్కువ సీట్లు సాధిస్తే రాజకీయాలను విడిచిపెడతానని ఎన్నికల ముందు చేసిన వాదనను జన్ సురాజ్ నాయకుడు ప్రస్తావిస్తూ, 'నితీశ్ కుమార్, ఆయన విజయం మధ్య, ఒకే ఒక విషయం ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.10 వేల ధరకు 60 వేల ఓట్లను కొనుగోలు చేయడం. ఇది ఓటు కొనుగోలునా లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగమా అనేది స్పష్టంగా చెప్పాలి' అని అన్నారు. 'స్వయం ఉపాధి చాలా ముఖ్యం. వారు హామీ ఇచ్చిన రూ.2 లక్షలు ఇవ్వాలి. మహిళలకు ఇచ్చే రూ.10 వేల మొత్తం సంక్షేమ కార్యక్రమం అని ఇది రుజువు చేస్తుంది. ఆరు నెలల్లో డబ్బు అందని వ్యక్తులు జన్ సురాజ్‌కు రావచ్చు. వారికి ఆ మొత్తం అందేలా మేము పోరాడతాము' అని ఆయన అన్నారు.

కశ్మీరీ ముస్లింలను అనుమానించొద్దు: ఒమర్

శ్రీనగర్: ప్రతి కశ్మీరీ ముస్లింను అనుమానించవద్దని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పేలుళ్ల కేసులో వైట్ కాలర్ ఉగ్రవాదానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. అదే సమయంలో అమాయకులైన ప్రజలకు హాని కలిగించకూడదని సూచించారు. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు పదార్థాలతో నిండిన కారులో జరిగిన పేలుడులో 13 మంది మరణించగా... పలువురు గాయపడ్డారు. ఈ కారు దక్షిణ కశ్మీర్ పుల్వామాకు చెందిన డా.ఉమర్ నబీదిగా గుర్తించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. గత శుక్రవారం నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు పేలుడు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పేలుడు ఘటనలో గాయపడిన బాధితులకు చికిత్సనందిస్తున్న శ్రీనగర్ ఆస్పత్రిని మంగళవారం ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల మీడియాతో మాట్లాడారు. 'సోమవారం నార్త్‌జోన్ ముఖ్యమంత్రుల సమావేశంలో కూడా ఈ అంశాన్ని లేవనెత్తాను. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అక్కడ ఉన్నారు. హోంశాఖ కార్యదర్శి, నార్త్‌జోన్ సీఎంలు, గవర్నర్లు, ఎల్‌జీలు అక్కడ ఉన్నారు. జమ్ముకశ్మీర్‌లోని ప్రతి పౌరుడిని ముఖ్యంగా కశ్మీరీ ముస్లింను అనుమానంతో చూడవద్దని వారికి విజ్ఞప్తి చేశాను' అని అన్నారు. ఢిల్లీ పేలుడుకు కారణమైన నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని పేర్కొన్నారు. అయితే జమ్ముకశ్మీర్ జనాభా మొత్తాన్ని ఉగ్రవాద సానుభూతిపరులుగా ముద్ర వేయలేమని ఆయన పునరుద్ఘాటించారు. పేలుడుతో సంబంధం లేకుండా, హింసకు వ్యతిరేకంగా తమ స్వరాన్ని వినిపించిన అమాయకులను ఈ పరిధిలోకి తీసుకురాకూడదని అన్నారు. కేంద్రం ఈ అంశంపై శ్రద్ధ వహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే ప్రజలు తగిన సమాధానం పొందుతారని తాను ఆశిస్తున్నానని అన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను ఇక్కడికి ఎలా తీసుకువచ్చారు? వాటిని ఏవిధంగా రవాణా చేసి, నిల్వ చేశారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు లభిస్తాయని అన్నారు. ఈ ఘటనలో మృతులకు సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఘటన జరిగిన వెంటనే స్పందించిన శ్రీనగర్ ఆస్పత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇది అంతర్గత విషయం... పరిష్కరించుకుంటాం

కుటుంబ కలహాలపై లాలు



పట్నా: తన కుటుంబంలో ఏర్పడిన చీలికలపై ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ తొలిసారి స్పందించారు. ఇది తమ కుటుంబంలోని అంతర్గత విషయమని, దీన్ని పరిష్కరించుకుంటామని వ్యాఖ్యానించారు. కొత్తగా ఎన్నికైన ఆర్జేడీ ఎమ్మెల్యేల సమావేశం నిన్న జరిగింది. దీనికి లాలూ, ఆయన సతీమణి రాబ్డీదేవి, మీసా భారతి, జగదానంద్ సింగ్ హాజరయ్యారు. తేజస్వీ యాదవ్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఆర్జేడీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తన కుటుంబంలోని కలహాల గురించి లాలు మాట్లాడారు. 'ఇది తమ కుటుంబ అంతర్గత విషయం. దాన్ని కుటుంబంలోనే పరిష్కరించుకుంటాం. ఈ సమస్యను నేను పరిష్కరిస్తాను' అని లాలు స్పష్టం చేశారు. బీహార్ ఎన్నికలకు తేజస్వి చాలా కష్టపడ్డాడని లాలు కొనియాడారు. పార్టీని తేజస్వి ముందుకుతీసుకెళ్తారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలకు ముందు లాలూ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పార్టీ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీ స్థాపించారు. ఇటీవల ఎన్నికల్లో మహువా స్థానం నుంచి పోటీ చేసి... ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల అనంతరం లాలు కుమార్తె రోహిణి ఆచార్య ఓ కీలక ప్రకటన చేశారు. తాను ఆర్జేడీ పార్టీ నుంచి, కుటుంబం నుంచి బయటకు వచ్చేసినట్లు పేర్కొన్నారు. తేజస్వి, ఆయన సహాయకులు తనను కుటుంబం నుంచి బయటకు పంపించినట్లు ఆరోపించారు.

నా తల్లిదండ్రుల పరిస్థితిపై దర్యాప్తు: తేజ్ ప్రతాప్

తన కుటుంబ పరిస్థితిపై లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. తేజస్వీ యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ద్రోహుల వల్ల తమ తల్లిదండ్రులు మానసిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోదీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నోఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వి సహాయకులు నా తల్లిదండ్రులు లాలూ ప్రసాద్, రాబ్డీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నా తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరు. ఈ విషయంపై దర్యాప్తునకు ఆదేశించాలని మోదీ, అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను' అని తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌ను ఆపండి

సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కేరళ ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను వాయిదా వేయాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)ని ఆదేశించాలని కేరళ ప్రభుత్వం కోరింది. ఎస్ఐఆర్, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం 'దాదాపు అసాధ్యం' అని ప్రభుత్వం పేర్కొంది. నవంబర్ 4 నుండి డిసెంబర్ 4 వరకు 'గందరగోళ' ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ సమయంలోనే కేరళలో స్థానికసంస్థల ఎన్నికలు జరగనున్నాయని తెలిపింది. డిసెంబర్ 9-11 తేదీల్లో రాష్ట్రంలోని ఎల్ఎస్‌జీఐలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణం ఓుంచిన సంగతి తెలిసిందే. ఈ రెండూ ఒకేసారి నిర్వహించడంతో మానవవనరులు దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వ రోజు వారీ పనితీరుపై తీవ్ర ప్రభావం పడనుందని పేర్కొంది. సిబ్బంది కొరత పాలనా ప్రతిష్టంభనకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. 'ఎస్ఐఆర్ అనే ఎన్నికల సంబంధిత విధుల కోసం ప్రభుత్వ, పాక్షిక ప్రభుత్వ సేవల నుండి సుమారు 1,76,000 మంది సిబ్బందిని, మరో 68,000 మంది పోలీసులు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించాల్సిన భారీ ప్రక్రియ. మరోవైపు, ఎస్ఐఆర్ సంక్లిష్టతతో కూడిన గందరగోళ ప్రక్రియ. దీనికోసం 25,668 మంది అదనపు సిబ్బంది సేవలు అవసరం. శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఎన్నికల సిబ్బంది పరిమితంగా ఉండటంతో వాటికి ఆటంకం ఏర్పడుతుంది. ఎస్ఐఆర్, ఎల్ఎస్‌జీఐ ఎన్నికల కోసం ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో అధికారుల కేటాయింపు దాదాపు అసాధ్యం, పాలనా ప్రతిష్టంభనకు దారితీస్తుంది' అని పిటిషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ రాజ్యాంగ బద్ధతకు మద్దతు ఇవ్వడం లేదని స్పష్టంగా పేర్కొంది. ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి అనుకూలంగా లేదని తెలిపింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత సవాలు ఎస్ఐఆర్ చట్టబద్ధతపై కాదని, నిర్వహిస్తున్న సమయంపైనని పిటిషనర్ తరపు న్యాయవాది సీకే శశి పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌తో స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించలేమని పిటిషన్ తెలిపింది. కేరళలో 941 గ్రామ పంచాయతీలు, 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీలు, 87 మునిసిపాలిటీలు, ఆరు కార్పొరేషన్లతో కూడిన 1200 స్థానిక స్వపరిపాలన సంస్థలు (ఎల్ఎస్‌జీఐ)లు ఉన్నాయి. మొత్తం 23,612 వార్డులు ఉన్నాయి. ఆర్టికల్ 243-ఇ, 243-యు కింద రాజ్యాంగ ఆదేశాన్ని, కేరళ పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 38, కేరళ మునిసిపాలిటీ చట్టంలోని సెక్షన్ 94 కింద ఐదు సంవత్సరాలలోపు ఎల్ఎస్‌జీఐలకు ఎన్నికలు నిర్వహించాలనే చట్టబద్ధ ఆదేశాన్ని పిటిషన్ ప్రస్తావించింది. దీంతో రాష్ట్రంలోని ఎల్ఎస్‌జీఐలకు ఓటింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన సహా ఎన్నికల ప్రకటన ప్రక్రియను రాజ్యాంగ, చట్టబద్ధమైన ఆదేశాలకు అనుగుణంగా 2025 డిసెంబర్ 21లోపు పూర్తి చేయాలని పిటిషన్ పేర్కొంది.

హసీనాకు మరణశిక్ష ఆందోళనకరం

శశిథరూర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తూ ఆ దేశ అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ (ఐసీటీ) ఇచ్చిన సంచలన తీర్పుపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరణశిక్ష విధించడం చాలా ఆందోళనకరమని విలేకరులతో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరణశిక్ష విధించడం సరైందని తాను విశ్వసించడం లేదన్నారు. ఏ కేసులో అయినా ప్రతిఒక్కరికీ... తమను తాము సమర్థించుకుంటూ వాదించే అవకాశం ఉంటుందన్నారు. ఆ తర్వాత ఇలాంటి మరణశిక్ష విధించాలన్నారు. మరో దేశానికి చెందిన న్యాయవ్యవస్థ, అంతర్గత విషయాలపై తాను వ్యాఖ్యానించడం సరైనది కాదన్నారు. కానీ, తాజా తీర్పు చాలా ఆందోళనకరంగా ఉందన్నారు.

ఇది బలిదాన ఆపరేషన్

ఉమర్ నబీ వీడియో బయటకు...

న్యూఢిల్లీ: ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడుకు పాల్పడ్డాడని అనుమానిస్తున్న ఉమర్ నబీ మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఆ పేలుడుకు ముందు సూసైడ్ బాంబింగ్ గురించి అతడు అందులో మాట్లాడాడు. దాని గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని, వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్ అని రెచ్చగొట్టేలా ఉమర్ వ్యాఖ్యలు చేశాడు. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతలోనే ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కుట్ర బయటపడింది. ఇదికాస్త ఉమర్‌లో భయాందోళనకు దారితీయడం... చివరకు ఎర్రకోట సమీపంలో ముందుగానే పేలుడు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ టెర్రర్ మాడ్యూల్ గత ఏడాది నుంచి ఓ సూసైడ్ బాంబర్ కోసం అన్వేషిస్తోందని, ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడైన డా.ఉమర్ నబీ దీనికోసం ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుల విచారణలో ఉమర్ ఓ కరడుగట్టిన ఉగ్రవాది అని, తమ కార్యకలాపాల కోసం ఓ ఆత్మాహుతి బాంబర్ అవసరమని అతడు పట్టుబట్టినట్లు తెలిసింది. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్ర దాడులు చేయడం గురించి ప్రతిసారీ అతడు ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని వార్తలు వచ్చాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ తక్షణమే రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆసుపత్రి బ్రాంచ్ గోపాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు,ఇతర సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరకి వినతిపత్రం ఇచ్చి చర్చించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దసరా దీపావళి పండుగలకు కూడా వేతనాలు అందలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర ఆదేశాల ప్రకారం దసరా పండుగకు ఏజెన్సీ యాజమాన్యం అడ్వాన్సు రూపేనా కొంతమేర చెల్లించిందని అన్నారు. వేతన బడ్జెట్ ఉన్న కార్మికులకు వేతనాలు రావడంలేదని అన్నారు. జీతాలు రాక పిల్లల ఫీజులు ఇంటి అద్దెలు నెలవారి ఈఎంఐలు చెల్లించలేక జీవనం దుర్భరమైపోతుందని అన్నారు. కనుక తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నేతలు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కర్ణ, కామేష్, బుచ్చన్న, మురళి, శివ కుమార్, బాలకృష్ణ, యం.రఘు,రవి తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణకు కేంద్ర అవార్డు

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా విశేష కృషిచేస్తున్న జలమండలికి మరో అవార్డు లభించింది. జల సంరక్షణలో జలమండలి చేపడుతున్న కృషికి ప్రకటించిన అవార్డును జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, జల వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 టాప్ మునిసిపల్ కార్పొరేషన్ కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 టాప్ మునిసిపల్ కార్పొరేషన్ కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు జల్ సంచయ్ జన భాగిదారీ 1.0 అవార్డ్ అందించారు. జల మండలి నీటి భద్రతతో కూడిన భవిష్యత్తుకు నీటి సంరక్షణ మాత్రమే కాకుండా ప్రజల ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించినందుకు, ఇవినతిని పరిధిలో కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం ద్వారా వాటర్ పాజిటివ్ యాక్షన్‌ను ప్రేరేపించడమే కాకుండా, మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఈ అవార్డులో భాగంగా నీటి సంరక్షణ కార్యక్రమాలకు రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహక బహుమతిని అందిస్తారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ జల సంరక్షణలో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. బోర్డు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోర్డు అధికారులపై నమ్మకం ఉంచి ప్రోత్సాహించడం, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం అయినట్లు తెలిపారు. రోజురోజుకు హైదరాబాద్ మహానగరం అంతకంతకు అభివృద్ధి చెందుతోంది. దీంతో నగరంలో జీవిస్తున్న వారి సంఖ్య దాదాపు కోటిన్నర జనాభాను దాటింది. దీంతో ప్రజల అవసరాల కొరకు నీటివినియోగం మరింతగా పెరిగింది. లాతూర్‌లో ఎదురైన నీటి కష్టాల అనుభవ దృష్ట్యా అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ఉండేందుకు సర్కారు విధానే క్రితం అక్టోబర్ 28 సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రతి ఇంటా ఇంకుడు గుంత-90 డేస్ స్పెషల్ డ్రైవ్ పేరిట కార్యక్రమానికి ప్రారంభించి జేసి నిరంతరం యజ్ఞంగా కొనసాగిస్తు వస్తున్నారు.

మాదకద్రవాల నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలిలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, మాదకద్రవ్యాల దుర్వినియోగ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరుపుకొన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం సామాజిక, మానసిక మరియు శారీరక సమస్యలకు దారితీస్తుంది. యువతను సరైన మార్గంలో పెట్టడమే లక్ష్యంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ పద్మజా, సీజీఎంలు, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధీరవత్ మహేష్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : లింగాపూర్ తండా, మేడ్చల్ జిల్లాకు చెందిన క్రీడాకారుడు, దివ్యాంగుడైన ధీరవత్ మహేష్, భారతదేశంలోనూ, విదేశాలలోనూ పలు క్రీడా ఈవెంట్లలో పాల్గొని, రాష్ట్ర స్థాయిలో 11 పతకాలు (3 బంగారు, 5 వెండి, 3 కాంస్య) సాధించారు. ఇటీవల ఆయన శ్రీలంకలో జరగనున్న జూనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ క్రీడలలో పాల్గొనడానికి రవాణా, భాగస్వామ్య ఖర్చుల నిమిత్తం రూ. 59,000 ఆర్థిక సహాయం చేయాలని ఆయన అభ్యర్థించారు. జిల్లా యువజన, క్రీడా అధికారి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఈ అభ్యర్థనను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. తదనుగుణంగా, మేడ్చల్ జిల్లా పరిశ్రమల కేంద్రం యొక్క జనరల్ మేనేజర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మేక్-యూస్ నాలెడ్జ్ (నియోఎంటైజ్ టెక్నాలజీ పార్క్) వారిని, తుర్కపల్లి, షామీర్పేట మండలం, మేడ్చల్ జిల్లాలోని భవనం నం.450, యూనిట్ నెం.1, నియోఎంటైజ్ టెక్నాలజీ పార్క్‌లో ఉన్న తమ యూనిట్ ద్వారా స్పాన్సర్‌షిప్ అందించాలని అభ్యర్థించారు. వారు ఇండియా పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరు మీద రూ. 59,000 చెక్‌ను అందించారు. ఈ మొత్తం, ధీరవత్ మహేష్‌కి ఎయిర్‌ఫేర్ ఛార్జీల నిమిత్తం జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ద్వారా అందజేశారు.

సరుకుల సరఫరా జాప్యంపై మంత్రి ఆగ్రహం

- జాప్యాన్ని సహించం..ఇదే చివరి అవకాశం
- పద్ధతి మార్చుకోకపోతే.. మిమ్మల్ని మార్చుతాం
- బెస్ట్ ప్రైస్ ఇస్తున్నాం..బెస్ట్ క్వాలిటీ ఇవ్వండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలోని వెంకటరావు నగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పప్పు, మంచి నూనె, పాలు, ఇతర అవసరమైన సరుకులపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దా. దనసరి అనసూయ సీతక్క జిల్లాల వారీగా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారులు, సరఫరాదారులు, మిల్క్ సప్లయర్లు పాల్గొన్నారు. కోడి గుడ్లు, సరుకుల సరఫరా పరిస్థితులు, జాప్యాలు, నాణ్యత సమస్యలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సరుకుల సరఫరాలో జరుగుతున్న జాప్యంపై మంత్రి సీతక్క కఠినంగా స్పందించారు. "మాకు కారణాలు చెప్పకండి. అంగన్వాడి చిన్నారుల కోసం కోడి గుడ్లు పది రోజులకు ఒకసారి ఇవ్వనుందుకే సరఫరా కావాలి. సాకులు చెప్పి జాప్యం చేసే కాంట్రాక్టుల రద్దు చేస్తాం," అని ఆమె హెచ్చరించారు. చిన్నారుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన, నిర్దిష్ట సైజు గుడ్లను సరఫరా చేయడం తప్పనిసరి అన్నారు. 'చిన్న గుడ్లు, నాసిరకం గుడ్ల సరఫరా మహా పాపం, అని మంత్రి స్పష్టం చేశారు.

నాణ్యమైన ఫుడ్ సప్లై ప్రభుత్వ లక్ష్యం.....

మరుసటిన్న వాతావరణంలో గుడ్లు త్వరగా పాడవుతుండటంతో పది రోజులకు ఒకసారి సప్లై వ్యవస్థ తప్పనిసరి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది గుడ్ల నిల్వపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల బరువు, ఎత్తు పెరగడానికి నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. సరుకుల నాణ్యతలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో గుడ్ల సప్లై దారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. సంక్షేమ హాస్టళ్లతో కలిపి సరఫరా చేయడం వల్ల సమస్యలు కుదరక ఇబ్బందులు వస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో అంగన్వాడి కేంద్రాలకు కేటాయించిన గుడ్లను హాస్టల్ నిర్వాహకులు ఒత్తిడి చేసి తీసుకుంటున్నారని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

మసాలా వస్తువుల నాణ్యతపై మంత్రి ఆగ్రహం

అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే జీలకర, ఆవాలు, పసుపు, ఉప్పు, కారం పొడి, చింత పండు వంటి వస్తువుల నాణ్యత ఆశించిన స్థాయిలో లేక పోవడాన్ని మంత్రి సీతక్క తీవ్రంగా పరిగణించారు.'అంగన్వాడి కేంద్రాలకు రెస్టారెంట్ లుగా భావించి నాసిరకం వస్తువులు ఇస్తే అస్సలు సహించను. నాణ్యత లేని వస్తువులు పిల్లల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడతాయి" అని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్‌కు సరుకుల కాంట్రాక్టులు ఇచ్చిన నాణ్యత పరంగా ఆశించిన ఫలితాలు రాలేదని మంత్రి సీతక్క తెలిపారు. 'ఆయిల్ ఫెడ్ నేరుగా రైతులు, మహిళా సంఘాల నుంచి ప్రొక్యూర్మెంట్ చేయాలి. లేదంటే అంగన్వాడి కేంద్రాలకు వస్తువుల సరఫరా కాంట్రాక్టులను నేరుగా మహిళా సంఘాలకు ఇస్తాము,' అని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలను ప్రోత్సహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించినట్లు ఆమె తెలిపారు. ఇదే మీ చివరి అవకాశం. నాసిరకం వస్తువులు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పిల్లల దేవళ్లతో సమానం వారికి అందించే ఆహారంలో ఎలాంటి రాజీ ఉండదు. అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

విశాలాంధ్ర, హైదరాబాద్ : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి సంగీత మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ 'నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తా, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని, డ్రగ్స్ ఉత్పత్తి, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసుశాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి యువత తమ పరిజ్ఞానం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని, తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో

మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్‌పై చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు బాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, ఈ.డి. ఎస్సీ కార్పొరేషన్ పద్మావతి, పిడి మెప్మా వెంకట నారాయణ, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత తెలంగాణకు చర్యలు : మంత్రి

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని మత్తు పదార్థాల బారి నుంచి పూర్తిగా బయటపడే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారతశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా జీవిత లక్ష్యాలకు దగ్గరగా అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి, యువకుడి వద్దకు చేర్చేలా సమగ్రమైన అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం గాంధీ మెడికల్ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ యువత చదువు, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసంలో నిలబెట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉందని మంత్రి అన్నారు. మత్తు పదార్థాల పెరుగుతున్న దుష్ప్రభావాల నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్ సరఫరా మార్గాలను పూర్తిగా నిర్మూలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ఈగల్ స్పెషల్ యూనిట్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. నగరాల్లో, విద్యాసంస్థల పరిసరాల్లో, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో, డార్క్‌వెబ్ ద్వారా జరిగే లావాదేవీలపై ఈగల్ టీమ్ నిరంతరం నిఘా పెట్టిందని చెప్పారు. రియల్ టైమ్ ఇంటెలిజెన్స్, డేటా విశ్లేషణ, వేగవంతమైన ఆపరేషన్లతో ఈ

వ్యవస్థ రాష్ట్ర పోలీసింగ్ విధానానికి కొత్త దిశగా నడిపించిందని అన్నారు. డ్రగ్ మాఫియాను ఒక్కో దశలో ఛేదిస్తూ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, నేర ప్రపంచాన్ని కట్టడి చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి వివరించారు. మత్తు వ్యసనం వ్యక్తిగత అలవాటు కాదు..ఇది కుటుంబాలను కూల్చివేసే ఒక అగ్నికీల అని మంత్రి పేర్కొన్నారు. యువత రక్షణ తెలంగాణ భవిష్యత్తు రక్షణేనని ముఖ్యమంత్రి అభిప్రాయమని అన్నారు. యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ సెషన్లు, స్పోర్ట్స్-కల్చరల్ ఈవెంట్లు, డ్రగ్ ఫ్రీ క్యాంపెయిన్స్, మారథాన్‌లు నిర్వహిస్తూ సానుకూల వాతావరణం ఏర్పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన, ఆటలు,పాటలు యువతలో మత్తు వ్యసనంపై అవగాహన కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డ్రగ్స్ కొద్ది రోజుల 'కిక్'తో మొదలై, భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తుంది. మనం చూస్తున్న కేసుల్లో అనేక మంది విద్యార్థులు అలవాట్ల బారిన పడి చదువు, అవకాశాలు, కుటుంబాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ భవిష్యత్తుపై ఒక పెద్దముప్పుగా పరిగణించిందన్నారు. ప్రవర్తనలో మార్పులు, అర్ధరాత్రి తిరగడం, కొత్త అలవాట్లుఉన్నట్టు మత్తు వ్యసన సూచనలుగా కనిపిస్తాయని, వెంటనే కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. విద్యాసంస్థల్లో ప్రత్యేక క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులపై నిఘా కొనసాగించాలని సూచించారు. మత్తు నిరోధక చర్యల్లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేసి, పాఠశాలలు-కళాశాలల్లో క్లబ్‌లు స్థాపించామని మంత్రి వివరించారు. ఇప్పటివరకు 15,891 విద్యాసంస్థల్లో 7,018 కార్యక్రమాల ద్వారా 1.45 కోట్ల మందికి అవగాహన కల్పించామని చెప్పారు. ఇది దేశంలోనే అతిపెద్ద డ్రగ్స్ అవగాహన కార్యక్రమమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. త్వరలో వచ్చిన జిల్లా ఆసుపత్రుల్లో కొత్త చికిత్సా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ %c% చైల్డ్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి అనిత రామచంద్రన్, టీజీ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, సీనియర్ సిటిజన్ %c% ట్రాన్స్‌జెండర్ విభాగం డైరెక్టర్ శైలజ, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సీతారాం, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను రక్షించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పత్తి రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తీసుకువెళ్లారు. 2025-26 పత్తి కొనుగోలు సీజన్ నేపథ్యంలో, కేంద్ర టెక్స్‌టైల్ యూనియన్ మంత్రి గిరిరాజ్ సింగ్ జీకి ఎంపీ అధికారిక లేఖ పంపి పలు కీలక సూచనలు చేశారు. సీసీఐ ప్రకటించిన రాష్ట్ర సగటు పత్తి దిగుబడిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడం తప్పు నిర్ణయం అని ఎంపీ పేర్కొన్నారు. ఈ అంచనా రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమర్పించిన ధృవీకరించిన డేటాకి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 6,680 ఎంఎంటీలు పత్తి కొనుగోలు, 3,175 మంది రైతులు లబ్ధి పొందారు. పత్తి కొనుగోలు మొత్తం విలువ రూ.52.25 కోట్లు, అందులో రూ.15.04 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ఇప్పటికే మొంతా తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పరిస్థితి మరింత దెబ్బతింటుందని, దిగుబడి అంచనాలను తగ్గించే నిర్ణయాన్ని పునర్విమర్శించాలని ఎంపీ వంశీ కృష్ణ కోరారు. ఆదేవిధంగా, పత్తి మిల్లర్ల అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సూచించిన మాయిశ్చర్ నార్మ్, ఎల్1/ఎల్ 2 విభజన సమస్య, స్లాట్ బుకింగ్ కష్టాలు, జిన్నింగ్ మిల్లుల కార్యకలాపాల సమస్యలు వంటి అంశాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సానుకూల చర్యలను ఎంపీ ప్రశంసించారు. టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్, 176 మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు, సీసీఐతో కలిసి జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్, అవగాహన కార్యక్రమాలు రైతులకు మేలు చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీ కృష్ణ రాష్ట్ర సగటు పత్తి దిగుబడి 11.74 క్వింటాళ్లుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మాయిశ్చర్ పరిమితిని 20శాతం వరకు సడలించాలని, మిల్లర్లు అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ చర్యలతోనే రైతులకు న్యాయమైన ధరలు, సాఫీ కొనుగోలు ప్రక్రియ సాధ్యమవుతుందని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి

విశాలాంధ్ర-దుండిగల్: నేటి సమాజంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలవల్ల పేద ప్రజల కుటుంబాలు చిన్న భిన్నమవుతు న్నాయని, వాటి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మున్సిపల్ సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవ్వాలని, డ్రగ్స్ రహిత జీవనశైలినే అనుకరిస్తూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని,డ్రగ్స్ కొనుగోలు,అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో అందరూ భాగస్వామి

అవ్వాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి లక్ష్మయ్య, వార్డ్ ఆఫీసర్లు మున్సిపల్ స్టాఫ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశవ్యాప్తంగా జరిగిన జల్ సంచయ్..జన భాగిదారీ 1.0 కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం "బెస్ట్ స్టేట్ అవార్డు"ను కైవసం చేసుకుని మరో మైలురాయిని సాధించింది. దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా నిలవడంతో పాటు, సౌత్ జోన్‌లో అన్ని అవార్డులను స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలోని 8 జిల్లాలు 1వ, 2వ మరియు 3వ స్థానాలను సాధించాయి. తమ ర్యాంకుల ఆధారంగా ప్రతి జిల్లా వరుసగా రూ. 2 కోట్లు, రూ.1 కోటి, రూ.50 లక్షల నగదు బహుమతులను గెలుచుకొని సత్తా చాటింది. ఈ నేపధ్యంలో రాష్ట్ర రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ జి. సృజన అందుకున్నారు. జిల్లా విభాగంలో అవార్డును జిల్లా కలెక్టర్లు, డిఆర్‌డిఓ లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ విశిష్ట విజయంలో కీలక పాత్ర పోషించిన జిల్లా కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దా. దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. అధికారుల కృషి, సమన్వయం, నిబద్ధత మన రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో మరింత గర్వించదగిన స్థాయికి తీసుకెళ్లాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రం తరఫున రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, ఇది మంత్రి సీతక్క మార్గదర్శకం లో సిబ్బంది సమిష్టి కృషి కి దక్కిన ఫలితం అని డైరెక్టర్ సృజన పేర్కొన్నారు.

ప్రముఖుల ఇళ్లలో ఐటి సోదాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మంగళవారం మరోసారి ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ హోటళ్ల చైర్మన్లు, డైరెక్టర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నగరంలో ఏకకాలంలో 15 చోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న హోటల్ బిజినెస్‌పై ఐటీ అధికారులు సోదాలు జరిపారు. పాతబస్తీ కేంద్రంగా నడుస్తున్న పిస్తా హౌస్, షాగౌస్ హోటల్స్‌పై ఐటీ సోదాలు జరిపారు. రెండు హోటల్స్ ప్రతి ఏడాది వందల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. పిస్తా హౌస్, షాగౌస్ హోటల్ ఓనర్ల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు ఐటీ అధికారులు. హోటల్స్ ప్రధాన కార్యాలయాల్లోనూ సోదాలు కొనసాగాయి. రాజేంద్రనగర్ లోని పిస్తా హౌస్ ఓనర్ మహ్మద్ మజీద్, మహ్మద్ మస్తాన్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదా యం మధ్య వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. హవాలా, నకిలీ లావాదేవీలు, అనుమా నాస్పద ట్రాన్సాక్షన్లు ఉన్నట్లు అధికారులు వెలుగుచూశారు. ట్యాక్స్ చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 4 టీమ్స్ తో మస్తాన్ ఇంట్లో సోదాలు జరుపుతున్నారు ఐటీ అధికారులు. మెహఫిల్ రెస్టారెంట్ ఓనర్ ఇంట్లోనూ సోదాలు జరిపారు. నగరం లోని ప్రముఖ బిర్యానీ రెస్టారెంట్ చైన్లపై ఐటీ సోదాలు కొనసాగిం చారు. భారీ స్థాయిలో పన్ను ఎగవేత ఆరోపణలతో సోదాలు చేస్తున్న ఐటీ.. కోట్ల రూపాయల విలువైన అక్రమాల వివరాలు గోప్యంగా ఉంచినట్టు అనుమానిస్తున్నారు. పిస్తా హౌస్, షా గౌస్, మెహఫిల్ గ్రూప్‌కు చెందిన కార్యాలయాలు, వారికి సంబంధించిన నివాసాలు, ఇతర సంబంధిత ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించడం జరిగింది. ఈ మూడు బ్రాండ్లకు చెందిన పలు యూనిట్లు, శాఖలు, అకౌంటింగ్ సెక్షన్లు, గిడ్డంగులు, నిర్వాహకులకు చెందిన ఇళ్లు వంటి చోట్ల ఒకేసారి సోదాలు జరపడం గమనార్హం. మెహఫిల్ రెస్టారెంట్ కి నగరంలో 15 బ్రాంచీలు.. అదనంగా యునైటెడ్ కూడా బ్రాంచ్ లు ఉన్నట్లు గుర్తించారు. పిస్తా హౌస్ కి విదేశాల్లో కలిపి మొత్తం 44 స్టోర్లు ఉన్నట్లు గుర్తించారు. గచ్చి బౌలి, ఓల్డ్ సిటీ తదితర ప్రాంతాల్లో షా గౌజ్ హోటల్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మహిళా జర్నలిస్టులపై అసభ్యకర పోస్టులపై చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా జర్నలిస్టులపై సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న బెదిరింపులు, అసభ్యకర పోస్టులు, దుర్భాషలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ నేతృత్వంలో స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా మహిళా జర్నలిస్టుల ప్రతినిధి బృందం కమిషన్ చైర్ పర్సన్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ ప్రచారాన్ని చూపించే అనేక వీడియోలను చైర్‌పర్సన్‌కు ప్లేచేసి చూపించింది. అనేక సోషల్ మీడియా హ్యాండిల్లు నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఇది పూర్తి క్రమబద్ధమైన ఆన్‌లైన్ వేధింపుల ధోరణి కొనసాగుతోందని తెలిపారు. కొన్ని హ్యాండిళ్లు ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు, ప్రొఫెషనల్‌ను బెదిరింపులు, అవహేళ నాత్మక పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నాయని తెలిపారు. ఈ ట్రోలింగ్ భయం కలిగించడం, తమ వృత్తిపరమైన పనిని అడ్డుకోవ డమే లక్ష్యంగా కనిపిస్తోందని వారు పేర్కొన్నారు. ఫిర్యాదుతోపాటు, మహిళలను ఉద్దేశిత కలిగించే కంటెంట్‌ను కూడా ఈ హ్యాండిల్లు విస్తృతంగా పోస్ట్ చేస్తున్నాయని తెలిపారు. సంబంధిత హ్యాండిల్లు, వ్యక్తులపై దర్యాప్తు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆన్‌లైన్-ఫిజికల్ రక్షణను కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద స్పందిస్తూ దాడి మాత్రమేనని, మహిళా జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని చెప్పారు.

డ్రగ్స్ నుంచి రక్షించండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : సమాజాన్ని డ్రగ్స్ ముప్పు నుండి రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ పిలుపునిచ్చారు. యువతలో పెరుగుతున్న డ్రగ్ వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, వారు మాదక ద్రవ్యాలకు బానిసైతే దేశ అభివృద్ధికి పెను ప్రమాదం కలుగుతుందని, అందరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల నిరోధానికి పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సామూహికంగా మాదక ద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ తీసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాద కేసులను పునఃపరిశీలించాలని వినతి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) బి. శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జూలై 15న 2025 అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చోటు చేసుకున్న ప్రొటోకాల్ ఉల్లంఘన వివాదం, కౌకూర్ ఫార్చ్యూన్ ఎంక్లేవ్ కాలనీ వాసులపై నమోదైన కేసు పునఃపరిశీలన, శాంతి భద్రతా చర్యల పురోగతి, అంశాలను డిజిపితో వివరంగా చర్చించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజలపై అనవసరమైన కేసులు నమోదు చేయ కుండా, న్యాయబద్ధంగా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిజిపి బి. శివధర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ డిజిపిని కలిసినవారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్‌లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర – మొయినాబాద్ : డ్రగ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశం అన్నారు. చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ అడ్మిన్ (సి.డి.ఎం) డాక్టర్ . టి.కె.శ్రీదేవి ఆదేశాల మేరకు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం మంగళవారం మున్సిపల్ సిబ్బందితో పాటు , మండల మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తమ పరిసరాలలో మాదక ద్రవ్యాల వినియోగం జరిగితే పోలీస్ యంత్రాంగానికి సమాచారం ఇచ్చి సమాజ రక్షణకు తోడ్పడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాఘవేందర్, అమరేందర్ రెడ్డి, మున్సిపల్ పట్టణ వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘ సభ్యులు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర –కొనిజర్ల : మండలంలోని పల్లిపాడు గ్రామంలో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది.స్థానికులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన దర్గా అనే వ్యక్తి గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి.గమనించిన స్థానికులు 108 సాయంతో వైద్యశాల నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళితుడు ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో మరో నిందితుడినీ షాద్ నగర్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. మంగళవారం షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ మరో నిందితుడు గణేష్ అరెస్టును ధ్రువీకరించారు. ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు కాగుల వెంకటయ్యతో పాటు పత్తి శీను, వడ్డే నర్సింలు, సోమ సురేష్, అలియాస్ సోమచ్, చందన్ కుమార్, బిజ్జు రాఘవేందర్,ఆవుల శ్రీకాంత్, కావుల రాములులను అరెస్టు చేశారు. గణేష్‌ను సిఐ విజయ్ కుమార్ నేతృత్వంలో పలువురు సిబ్బంది గాలించి అతని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి చట్టపరంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఏసిపి లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... నిందితులను ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఈ కేసుతో సంబంధం ఉన్న అందరిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ హత్య కేసులో ఒక ఇన్నోవా మరొక టవేరా రెండు బైకులు ఒక సెల్ ఫోన్ కొంత నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఎల్లంపల్లి గ్రామ దళితుడు ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన షాద్ నగర్ పోలీసులు సీఐ విజయ్ కుమార్, ఎస్సైలు సుశీల, శరత్ కుమార్ మరి కొంతమంది సిబ్బంది పనితీరు ప్రశంసిస్తూ వారికి ఉన్నతాధికారుల చేతుల మీదుగా రివార్డులు అందజేస్తామని తెలిపారు.

బదిలీ ఉత్తర్వులు బేఖాతర్?

విశాలాంధ్ర, హైదరాబాద్: కమిషనర్ ఉత్తర్వులు బేఖాతరు అవుతున్నా పట్టించుకునే పరిస్థితి జిహెచ్ఎంసిలో కరువైందనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా అసిస్టెంట్ ఎగ్జామినర్ పర్వతాలు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. తనకు బదిలి ఉత్తర్వు గత నెల 30న విడుదల అయ్యింది. తాను కమిషనర్ ఆర్డర్లను బేఖాతరు చేస్తూ నేను ఇక్కడే వర్క్ చేస్తాను నన్ను ఎవరు ఏమి చేయలేరనే ధీమాను వ్యక్తం చేయడం జరుగుతుందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు కె.బాలకృష్ణ తెలిపారు. పర్వతాలు సికింద్రాబాద్ జోన్‌కు బదిలి కాగా, అడిట్ డిపార్టుమెంట్ విభాగం నుంచి జే.శ్రవణ్ కుమార్ బదిలిపై వచ్చి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ జోన్‌లో పని చేసిన పి.ఎస్.భాగ్యలక్ష్మి పదవీవిరమణ చేయడంతో పోస్టు ఖాళీ అయింది. దీంతో పర్వతాలు ఇక్కడికి బదిలి చేసినట్లు ఆయన తెలిపారు. పర్వతాలు మాత్రం ఇక్కడి నుంచి సికింద్రాబాద్ జోనల్‌కు వెళ్ళక పోవడంలో ఆంతర్యం ఏంటని, అసిస్టెంట్ ఎగ్జామినార్ పర్వతాలుకు చీఫ్ ఎగ్జామినగర్ వెంకటేశ్వర్ రెడ్డి అండదండలు అందిస్తున్నట్లు తెలిపారు. చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి అండదండలు ఉండడం వలన తాను మితిమీరి పోవడం ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, నిబందనలు పాటించాల్సిన అధికారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఎవరు తీసుకుంటారని, ఇలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె.బాలకృష్ణ డిమాండ్ చేశారు.

సౌదీ ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మక్కా నుండి మదీనా కి బయలుదేరిన బస్సు ఆయిల్ ట్యాంకర్ ను ఢీ కొట్టిన సంఘటనలో 45 మంది చనిపోవడం అత్యంత విషాదం. ఒకే కుటుంబానికి సంబంచిన 18 చనిపోవడం, ఒక కుటుంబం లో తల్లి తండ్రులు చనిపోయి ఇద్దరూ పిల్లలు అనాధలుగా మారిన ఘటన లు హృదయ విదారకమైనవి. మృతులకు సంతాపాన్ని ,వారి కుటుంబ సభ్యులకు,మిత్రులకు సానుభూతి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాల్సిన అవసరం ఉన్నదని నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించటం, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పూర్తిగా ఉచితంగా విద్య కల్పించాలని అన్నారు. మృతుల గుర్తింపును వేగవంతం చేసి భారత నుండి వాళ్ళ బంధువులను అక్కడ జరిగే అంత్యక్రియలకు ఎక్కువ మందిని తీసుకుపోవడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలి.

రిజర్వేషన్లు పార్టీ పరంగా వద్దు..చట్టపరంగా ఇవ్వాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: చట్టబద్ధంగా ఇస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ అధ్యక్షులు పదేపదే ప్రకటించి ఒక సంవత్సరం కాలంగా నమ్మించి ఇప్పుడు అది కాదని పార్టీ పరంగా 42 శాతం ఇస్తామని క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం అని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బాణాల అజయ్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను నమ్మించి మోసం చేయడం దగా చేయడం కదా విమర్శించారు. ఈ మోసానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ఇకముందు జరిగేది యుద్ధమేనని అన్నారు. రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మొదటి నుంచి వివిధ పార్టీల మద్దతు ద్వారా పోరాడితే సాధించే అవకాశం ఉన్న చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వహించే ఇండియా కూటమికి లోక్‌సభలో 240 మంది ఎంపీలు ఉన్న ఒక్కరోజు పార్లమెంట్ ప్రశ్నించలేదన్నారు. క్యాబినేట్‌లో మొదటగా గ్రామా పంచాయితీ ఎన్నికలు జరుపుతాంఅని ప్రకటించారాని, గ్రామ పంచాయితీ ఎన్నికలు పార్టీపరంగా ఉండవు, పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మార్చి లోపు ఎన్నికలు పూర్తి చేయకపోతే 3వేల కోట్లు వృథా అవుతాయని ముఖ్యమంత్రి అంటున్నారనీ, 3 వేల కోట్ల బడ్జెటు కంటే బి.సి రిజర్వేషన్ ముఖ్యం అన్నారు. 2 కోట్ల మంది బీసీ సమాజం ఎదురుచూస్తున్నా రిజర్వేషన్లను సదరకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ నెల 21 నుంచి తెలంగాణ వ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోల కార్యాలయ ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, అనంతయ్య, సి.రాజేందర్, రాందేవ్ మోడీ, పగిళ్ల సతీష్, వెంకటేష్ నేత, ఎత్తరి భీమ్ రాజ్, రాజ్ కమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి :ఎస్ఎన్‌రెడ్డి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రైవేటు పాఠశాలల నిర్వహకులపై బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వారి నుంచి పాఠశాలల నిర్వవాహకులకు రక్షణ కల్పించాలని తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని విబిపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వరంగల్ జిల్లాలో పిడిఎస్ యూ నాయకులు పాఠశాల యాజమాన్యంపై భౌతిక దాడులకు దిగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా తరుచుగా జరుగుతూనే ఉన్నాయని ఆందేళన వ్యక్తం చేశారు. కులసంఘాలు, విద్యార్థి సంఘాలు, జేఏసీలు, రాజకీయ పార్టీల అనుబంద సంఘాలు అంటూ ఇలా నిత్యం ప్రతి పాఠశాల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూనే ఉన్నారని అన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు బడ్జెట్ పాఠశాలలు విద్యాబుద్దులు నేర్పిస్తున్నాయని గుర్తు చేశారు. సేవే పరమావధిగా నిర్వహిస్తున్న పాఠశాలలను రక్షణ కరువైందని వాపోయారు. ట్రస్మా రాష్ట్ర కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలల నిర్వహణ కోసం సంఘం తగిన సలహాలు సూచనలను అందిస్తుందని తెలిపారు. ఇఎస్ ఐ, పిఎఫ్, ప్రొఫెషనల్ టాక్స్ తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా అంశాలపై రాష్ట్ర కమిటి ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాంచందర్, సత్యారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు లతో పాటు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన కమిటి

తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, కె.ఆంజనేయులు, కె.శ్రీనివాస్‌లు, ఎస్.సోమశేఖర్, ధనలక్ష్మి, ఎస్.అశోక్‌రెడ్డి, మథ్యూ జోసఫ్, తాజోద్దీన్, స్వరూప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఆంజనేయులు, కార్యనిర్వహక కార్యదర్శులుగా సిహెచ్ నర్సింహులు, ఎస్.ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా వీరన్న, జి.మన్‌మోహన్‌రావు, ఎం.సాయిగణేష్, జి.విజయ్ భాస్కర్‌రెడ్డి, టి.లిథియా, సి.శ్రీనివాస్ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, ఈ.దశరథ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులుగా సిహెచ్ మహేందర్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఆనంద్, మల్లిఖార్జున్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనాథ్‌రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం'కు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంలో భాగంగా సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ప్రోత్సాహకం కోసం అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం తెలిపారు. ఈ పథకంలో భాగంగా గతంలో మెయిన్స్‌కు ఎంపికై ఇప్పటికే లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని, తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు ఎవరైనా ఇంటర్వ్యూలకు ఎంపికైతే వారికి కూడా ఈ ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. సమాచారం లేకపోవడం వల్ల తాము దరఖాస్తు చేసుకోలేదని, సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యామని, తమకు ఆర్థిక ప్రోత్సాహకం అందించాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని, ఈ నేపథ్యంలో వారికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత అభ్యర్థులు తమ దరఖాస్తులను, వివరాలను ఈ నెల 21లోపు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అందజేయాలని కోరారు. త్వరలో అర్హులందరికీ రెండో విడత లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ యువతకు చేయూతగా రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం. గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం ద్వారా మొదటగా మెయిన్స్‌కు ఎంపికైన 140 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మందికి మరో విడతగా రూ.లక్ష చొప్పున సాయం అందించగా వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో టాపర్గా నిలిచిన 11వ ర్యాంకర్ ఇందులో ఉన్నారని వివరించారు. ఈ ఏడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి ఆర్థిక చేయూత అందించగా 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీలో రూ.35 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు కార్పొ రేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం గోల్డెన్ తులిప్ కాలనీలో రూ.35 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1650 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలియచేసారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, కొండాపూర్ డివిజన్, శేరిలింగంపల్లి నియోజక వర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు చోరీపై యూత్ కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర , కాప్రా : తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు చోరీ నిరసన కారిక్రమంలో జాతీయ అధ్యక్షులు ఉదయ్ బాను చీబ్ , రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ , ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు అరుణ్ పటేల్‌తో కలిసి పాలుగొన మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్ గౌడ్ ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రశాంత్, వాసు, సచిన్, జనరల్ సెక్రటరీ వినేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి, ఇంతియాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ శత వసంతోత్సవాలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రజల భాగస్వామ్యంతో డిసెంబర్ 26 న ఖమ్మం లొ జరిగే సిపిఐ శాతవాసంతోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మంగళవారం జరిగిన కొత్తగూడెం టౌన్, సుజాతనగర్, జూలూరుపాడు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, ముఖ్యుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సిపిఐ వంద సంవత్సారాలు పూర్తి చేసుకుంటున్న సందర్గంగా జాతీయ స్థాయి ముగింపు వేడుకలు, బహిరంగ సభ ఖమ్మంలొ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు జిల్లా నుంచి లక్ష మందిని తరలించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వందేళ్లుగా పేద, బడుగు, బహీన వర్గాలకు, రైతులకు, కార్మికవర్గానికి సిపిఐ అందిస్తున్న సేవలు, ప్రజా పోరాటాలను ఈ తరం యువత కు, ప్రజలకు వివరించేవిధంగా ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. 40దేశాలకు చెందిన కమ్యూనిస్టు ప్రతినిధులు పాల్గొంటున్నారని సాబీర్ పాషా తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్లో ప్రారంభమైన రెండు రాష్ట్ర ప్రచార జాతాలు ఈ నెల 21న జిల్లాలో ప్రవేశిస్తాయన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఈ ప్రచారజాతాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభ సందర్భంగా జిల్లా వ్యాపితంగా పది కేంద్రాల్లో జనసేవాదళ్ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు వేల మంది యువకులను జనసేవాదళంగా సిద్ధంచేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, గనిగళ్ల వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్యా దస్రు, ఎస్ కె ఫహీమ్, మండల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వర్ రావు, దీటి లక్ష్మీపతి, కొమారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 – గాజులరామారం డివిజన్ 'ఎయిరో నగర్' కాలనీలో బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పర్యటించారు.ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి,అంతర్గత రోడ్ల మరమ్మత్తులతో పాటు మౌలిక వసతుల కల్పనపై విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తూ 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో 'ఎయిరో నగర్' అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు హనుమంతరావు, మాజీ వార్డు సభ్యులు అంజన్ గౌడ్,అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్,అంజన్ గౌడ్,నాయకులు ఇమ్రాన్ బేగ్,చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, ప్రసాద్, గౌస్, శ్రవణ్, మహిళా నాయకురాలు మామి,ఎయిరో నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాజగోపాల్,కోశాధికారి సాయి ప్రసాద్,డైరెక్టర్లు ఏసీఎస్ రావు,ఉమారాణి,కాలనీ వాసులు సుబ్బు యార్లగడ్డ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

26న హైదరాబాద్ దస్కార్ బజార్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : హైదరాబాద్ దస్కార్ బజార్ 26న ఉదయం 11:00 – సాయంత్రం 8:00 దస్కార్ 5వ హైదరాబాద్ హ్యాండ్స్ అండ్ కల్చర్ వేడుక, సంస్కృతిని హృదయంలో కలిగి ఉన్న అమీర్‌పేట్ హైదరాబాద్ లో, సాంప్రదాయ చేతితో తయారు చేసిన వాటిని పునరుద్ధరించడంలో ప్రసిద్ధి చెందిన మార్గదర్శక క్రాఫ్ట్ సంస్థ భారతదేశం అంతటా 75 కి పైగా క్రాఫ్ట్ గ్రూపులను తీసుకువస్తుంది. స్కేల్ సన్నిహితంగా ఉన్నప్పటికీ, బజార్ హృదయం, ప్రామాణికత కళాత్మకతలో సమృద్ధిగా ఉంది. నాలుగు దశాబ్దాలకు పైగా, భారతీయ క్రాఫ్ట్, చేతితో తయారు చేసిన సంప్రదాయాలు సంబంధితంగా, అందుబాటులో ఉండేలా జరుపుకునేలా చూసుకోవడంలో ముందంజలో ఉంది. యంత్రాలచే తాకబడని సృష్టిని జరుపుకుటు, పూర్తిగా చేతితో తయారు చేసినవి, లోతైన మానవీయమైనవి కథలతో నిండి ఉన్నాయి. హైదరాబాద్ దస్కార్ బజార్లో, మాస్టర్క్రాఫ్ట్మెన్, వీవర్స్ ద్వారా చేనేత వస్త్రాలు అండ్ సహజ-రంగు, ఖుర్జా కుండలు, తోలు పాదరక్షలు, ఆభరణాలు అండ్ ఎంబ్రాయిడరీ, సాంప్రదాయ ప్రాంతీయ జానపద చేతిపనులు మొదలైన ప్రదర్శించడం జరుగుతుంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: గౌలిదొడిలో రూ.40.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్ నిర్మాణం పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గౌలిదొడ్డి ప్రాంతంలోని హ్యుందాయ్ సర్వీస్ సెంటర్ వద్ద వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్ట్రాం వాటర్ డ్రెయిన్ లైన్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఈ నిర్మాణం పనుల పూర్తయ్యిన తర్వాత గౌలిదొడ్డిలో నీటినిల్వ సమస్య గణనీయంగా తగ్గి ప్రజలకు పెద్ద ఉపశమనం కలుగుతుందన్నారు. శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని అన్ని అన్నారు. పతీ బస్తీ, కాలనీల్లో కోట్ల నిధులు వెచ్చించి మంచినీరు, రోడ్లు, కరెంటు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా తమ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్ ,జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ శిరీష , ఏ ఈ రషీద్,సీనియర్ నాయకులు నర్సింగ్ నాయక్ ,ప్రసాద్, కిషన్,కృష్ణ, శ్రీశైలం,శ్రీను,డివిజన్ నాయకులు, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్,కాలనీ వాసులు స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కొడుకు దౌర్జన్యాలపై తల్లి ఆవేదన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తల్లి ఆధీనంలో ఉన్న ఆస్తిని లాక్కోవాలని తనయుడు చేస్తున్న దౌర్జన్యాలు బయటపడుతున్నాయి. ఎలాగైనా ఆస్తి దక్కించుకోవాలని సొంత తల్లిని చంపాలని తనయుడు తన భార్య బంధువులు, కిరాయి గుండాలతో చేస్తున్న ఆరాచకాలు కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచలో నెలకొన్నాయి. కొడుకు ఎలాగైనా చంపుతాడని భావించిన ఆ తల్లి తనకు ప్రాణ హాని ఉందని నేరుగా పాల్వంచ ప్రెస్ క్లబ్లో మంగళవారం సమావేశంలొ ఆవేదన వ్యక్తం చేసింది. కన్నీటి పర్యంతమై బాధితురాలు ఎండి ముంతాజ్ బేగం (74) వ్యక్తం చేసిన కథనం ఇలా వుంది... పాల్వంచ మండలం బసవతార కాలనీలో ఎం.డి ముంతాజ్ బేగం తన భర్త ఎం.డి. ఫయాజుద్దీన్ ఖాన్ నిర్మించిన ఇంటిలో (నెం: 4-124/3) ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమెకు బీపీ, షుగర్, థైరాయిడ్, హార్ట సమస్యలు వెంటాడుతున్నాయి. ఈమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారందరూ వేర్వేరు ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్నారు. ఆమె భర్త ఫయాజుద్దీన్ బ్రతికుండగా ఆ ఇంటిని భార్య ముంతాజ్ పేర రాసారు. ఆమె అనంతరం పిల్లలందరూ సమానంగా పంచుకోవాలని రిజిస్టర్ వీలునామా చేయించినట్లు రికార్డులున్నాయి. భర్త ఫయాజుద్దీన్ గతఏడాది మృతి చెందారు. అప్పటి వరకు ఇంటి పైభాగంలో చిన్న కుమారుడు ఎం.డి. రహమత్ ఖాన్ ఉండేవాడు. కొన్ని కారణాల వల్ల రెండేళ్లుగా అతను ఇంటి నుండి వెళ్లి బయట వేరేగా ఉంటున్నాడు. రహమత్ ఖాన్ అతని భార్య గులాబ్ షాతో పాటు అతని బావమరిది రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన ఇమ్రాన్, కొందరు రౌడీలతొ ఇటీవలే తరచుగా తల్లి వద్దకు వచ్చి ఆఇల్లు తన పేరు రాయకుంటే చంపుతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడని ముంతాజ్ కన్నీటి పర్యంతమైంది. కొడుకు రెహమత్ ఎన్నో సార్లు తనపై దౌర్జన్యం చేసాడని ఈ నెల 12 న వారంతా ముఠాగా ఏర్పడి రౌడీ మూకలతో వచ్చి సీసీ కెమెరాలు పగులగొట్టి ఇల్లంతా బీభత్సం సృష్టించారని తెలిపింది. ఆస్తి మొత్తం తనకు రాసివ్వాలని బెదిరిస్తూ వేధిస్తు తనను చంపుతానని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ముంతాజ్ భయాందోళన వ్యక్తం చేసింది. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం పట్ల నిలబడే,పేదల పక్షం వహించే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజులు కలిసి తనకు న్యాయం చేయాలని ఆమె అభ్యర్థించింది. విలేకరుల సమావేశంలో బాధితురాలితో కుటుంబ సభ్యులు యండి. షఫీ ఖాన్, సాబీర్ ఖాన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులపై దుర్మార్గ చట్టాలు

- రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించాలి
- రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు బోనస్ ఇవ్వాలి
- ఏఐకేఎస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర- ఆదోని: పత్తి రైతులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలు తీసుకొస్తుందని, పత్తి పంట క్వింటాలుకు రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం కేరళ, తెలంగాణ రాష్ట్రాల తరహాలో క్వింటాల్‌కు రూ.3 వేల బోనస్ కల్పించాలని ఏఐకేఎస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జేబీ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం రైతుసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ పత్తి రైతుల సమస్యలపై ఏఐకేఎస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నిరంతరం పోరాటం చేస్తున్నాయన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1990 దశకంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, నేడు అదే పరిస్థితి పునరావృతమవుతోందన్నారు. 11 క్వింటాళ్లు కొంటానని మాట ఇచ్చిన సీసీఐ... కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం దుర్మార్గమని రావుల వెంకయ్య మండిపడ్డారు. పండించిన పంటలను అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. అమెరికా భారతదేశాన్ని ప్రమాదంలోకి నెడుతున్న అమెరికాతో ప్రధాని నరేంద్రమోదీ స్నేహం చేయడం దేశ ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులతో కార్పొరేట్ శక్తులు రైతులను తీవ్ర నష్టాలపాలు చేస్తున్నాయని విమర్శించారు. నకిలీ

నాసిరకం విత్తనాలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటకు కేరళ, తెలంగాణ తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పత్తి మద్దతు ధర కోసం ఆందోళనలు: రాజన్ క్షీరసాగర్

పత్తికి మద్దతు ధర కోసం ఏఐకేఎస్ ఆందోళనలకు సిద్ధమవుతోందని రాజన్ క్షీరసాగర్ చెప్పారు. పత్తి మద్దతు ధర కోసం ఆదోనిలో రైతు సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తూ కార్పొరేట్ కంపెనీలకు సీసీఐ ఊడిగం చేస్తోందని విమర్శించారు. పంటలకు మద్దతు ధర కోసం, రైతుల సమస్యల పరిష్కారం కోసం అతుల్ కుమార్ అంజాన్ జాతీయస్థాయిలో పెద్దఎత్తున పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించకుండా, బీమా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. రైతులను రక్షించడం ద్వారానే దేశం బాగుపడుతోందన్న నినాదంతో ఏఐకేఎస్ ముందుకు పోతుందన్నారు.

రైతుల ఆత్మహత్యలు బాధాకరం: ఈశ్వరయ్య

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా నేటికీ రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమేనని ఈశ్వరయ్య విమర్శించారు. గతంలో ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, గుంతకల్లు, కడప స్పిన్నింగ్ మిల్లులు ఉండేవని, ఆదరణ లేక అవి మూతపడ్డాయన్నారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రతిరోజు 35 నుండి 40 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించకపోవడంతో రాయలసీమ రైతులు వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కర్నూలు జిల్లాలో గుండ్రేవుల, వేదావతి, ఆర్డీఎస్, సిద్దేశ్వరం, కడప జిల్లాలో గండికోట ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు పంటలు పండించలేక అప్పుల పాలవుతున్నారని అన్నారు. టమోటా, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పంటలను రోడ్లపై పోసి రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు లేదన్నారు.

21 నుంచి ఆందోళనలు: కేవీవీ ప్రసాద్

పత్తి రైతులకు గిట్టుబాటు ధర, బోనస్ కోసం రైతు సంఘం అధ్వర్యంలో అంచలవారీగా ఆందోళనలు చేపడతామని కేవీవీ ప్రసాద్ అన్నారు. ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు సంతకాల సేకరణ, 24న సచివాలయాలలో వినతిపత్రాల అందజేత, డిసెంబరు ఒకటో తేదీన జిల్లా కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం, డిసెంబరు 8వ తేదీన గుంటూరులో సీసీఐ కేంద్రం ముందు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. క్వింటాల్ పత్తికి రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించి, పత్తిపై జీఎస్టీ ఎత్తివేయాలని, పత్తి రవాణా ఖర్చు ప్రభుత్వమే భరించాలని, పత్తి గ్రేడింగ్‌ను ఉపాధి హామీ పథకం కిందకు తీసుకురావాలని, విత్తనాలు, ఎరువులకు జీఎస్టీ రద్దు చేయాలని తీర్మానం చేసింది. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపనగౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి వీరేష్, రైతు సంఘం నాయకులు కాటమయ్య, జమ్ములయ్య, గంగాభవాని, ఆదినారాయణ, జిగ్నేశ్వరి, కల్లుబావి రాజు తదితరులు పాల్గొన్నారు.

కశ్మీరీల భద్రత, హక్కులకు హామీ

సీపీఐ డిమాండ్ – అసోంలో అక్రమ నిర్బంధానికి ఖండన

న్యూదిల్లీ: దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటూ అక్కడ పనులు చేసుకుంటున్న కశ్మీరీల భద్రతకు, గౌరవానికి, రాజ్యాంగబద్ధ హక్కులకు హామీ కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దిల్లీ, కశ్మీర్ మధ్య దూరాన్ని తగ్గిస్తామని, మనస్సులు కలుపుతామని గొప్పగా ప్రకటనలు ఇచ్చే ప్రధాని మోదీకి, బీజేపీకి సామాన్య కశ్మీరీ కార్మికుల పరిస్థితి పట్టడంలేదని దుయ్యబట్టింది. కశ్మీరీలు తరచూ వేధింపులకు గురవుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసింది. కశ్మీరీల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంతని ప్రశ్నించింది. అసోంలోని న్యూ టిన్సుకియా రైల్వేస్టేషన్ సమీపంలోని హిజుగురి వద్ద జమ్మూకశ్మీర్‌కు చెందిన 44 మంది కార్మికులను స్థానికులు నిర్బంధించడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. కార్మికులందరి వద్ద చట్టబద్ధమైన గుర్తింపు పత్రాలు ఉన్నాయని పోలీసులు ధ్రువీకరించినప్పటికీ కేవలం వారి వేషధారణ చూసి అనుమానంతో ముట్టడించి వేధించారని పేర్కొంది. ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలతో జమ్మూకశ్మీర్ ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులు తీవ్ర ఉల్లంఘనలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఇలా మొదటిసారి జరగలేదని... అసోం, హర్యానా వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కశ్మీరీలు తరచూ వేధింపులకు గురవుతున్నారని తెలిపింది. కశ్మీరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఇటీవల గురుగ్రామ్‌లో వివాదాస్పద నోటిఫికేషన్ జారీ అయిందని సీపీఐ గుర్తుచేసింది. సమాజాన్ని విభజించాలనే బీజేపీ విస్తృత అజెండాకు ఇటువంటి చర్యలు అద్దంపడుతున్నాయని. కశ్మీరీలంటేనే అనుమానంతో చూసే పరిస్థితులను కల్పిస్తున్నాయని వ్యాఖ్యానించింది. కశ్మీరీల భద్రత, హక్కులకు, గౌరవానికి హామీ లభించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ డిమాండ్ చేసింది.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా, అతని భార్య, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడంపై సమగ్ర న్యాయ విచారణ చేయించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిడ్మా, అతని భార్య సహా ఆరుగురిని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపటం దుర్మార్గం. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ప్రకటించినప్పటికీ కేంద్రం దమనకాండ కొనసాగించటం గర్హనీయమని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సింది ఉండగా...ఎన్‌కౌంటర్ పేరుతో నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపటాన్ని తీవ్రంగా ఖండించారు. ఏపీ, తెలంగాణ సరిహద్దులో జరిగిన ఎనౌకౌంటర్‌పై న్యాయ విచారణ చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా హింసాత్మక విధానాలు మాని... ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా మావోయిస్టులతో చర్చించాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు.

హిడ్మా...సహచరులకు విప్లవ జోహార్లు: ఈశ్వరయ్య

పువ్వర్తిలో వికసించిన పువ్వు, భారత విప్లవోద్యమ అగ్రనేత, కానూ, సిద్ధూ, బిర్సా ముండా, రాంజీ గోండ్, గుండాదూర్, కొమురం భీమ్ వంటి అసంఖ్యాక ఆదివాసి పోరాటయోధులు గర్వించదగిన వారసుడు...పాలకవర్గాలకు వణుకు పుట్టించిన వీరుడు మడ్వి హిడ్మాకు, ఆయనతో పాటు నేలకొరిగిన సహచరులందరికీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కన్నీటి నివాళి...జోహార్లు అర్పించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిడ్మా, అతని భార్య, మరో నలుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపటం దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ముందుకొచ్చినప్పటికీ...ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం బూటకపు ఎన్‌కౌంటర్లకు దిగడం దారుణమని ఖండించారు. దీనిపై తక్షణమే సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టుల అరెస్టుల పేరుతో భారీగా పోలీసు బలగాలను రంగంలోకి దించి అరెస్టులు, హడావుడీ చేయడాన్ని తప్పుపట్టారు. మావోయిస్టులతో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరగకుండా...ఎన్‌కౌంటర్లతో వారిని హతం చేయడాన్ని, దమనకాండ కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించారు.

మావోయిస్టుల అలజడి

విజయవాడలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చాలాకాలం తర్వాత మావోయిస్టుల అలజడి రేగింది. ఆపరేషన్ కగార్‌తో వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల మృతితో చత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చారన్న సమాచారంతో కొంతకాలంగా పోలీసులు నిఘా పెట్టారు. ఏకకాలంలో రాష్ట్రంలోని అల్లూరి, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బృందాలు ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటి వరకు విజయవాడనగర పరిసర ప్రాంతాల్లో 32, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని, మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 50 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంప్‌ల కోసం గాలింపు కొనసాగుతోంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బృందాలు ఆపరేషన్ చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొన్ని నెలలుగా ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం కేంద్ర బలగాలు, గ్రేహౌండ్స్ జల్లెడ పట్టాయి. కొంతమంది మావోయిస్టు తలదాచుకునేందుకు కాకినాడ, ఏలూరు, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలకు తరలి వచ్చారనే సమాచారంతో ఆ జిల్లాల ఎస్పీలు నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణా, అల్లూరి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో 60 నుంచి 70 మంది మావోయిస్టులు తలదాచుకోగా... ఇప్పటివరకు 50మందికి పైగా మావోయిస్టులు, సానుభూతి పరులను అధికారికంగా అరెస్టు చేసినట్లు తెలిసింది. వీరిలో నలుగురు కీలక వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. మిగిలిన మావోయిస్టుల కోసం పోలీసులు భారీగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. అరెస్టయిన వారంతా చత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో కొందరు మావోయిస్టులు, సానుభూతిపరులు, మహిళలు ఉన్నట్లు సమాచారం. అల్లూరిజిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేత మడ్వి హిడ్మా, అతని భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్ అయిన కొద్ది సేపటికే విజయవాడ శివారులో భద్రతా బలగాల సోదాలు చేపట్టడం కలకలం సృష్టించింది. అలాగే ఐదు జిల్లాల్లో అక్టోపస్, ఇంటిలిజెన్స్ బృందాలు భారీగా ఆపరేషన్ చేపట్టాయి. అటు..మావోయిస్టుల ఎన్‌కౌంటర్, అరెస్టులను సీపీఐ, పౌర హక్కులు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించాయి. మావోయిస్టులు చర్చలకు సిద్ధపడినప్పటికీ వారితో కేంద్రం సంప్రదింపులు చేపట్టకుండా ఆపరేషన్లతో హతం చేయడాన్ని తప్పుపట్టాయి. పట్టుబడిన మావోయిస్టులందర్నీ న్యాయస్థానం ముందు హాజరు పరచాలని పౌరహక్కుల నేత చిలక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

ఏలూరులోని గ్రీన్‌సిటీ ప్రాంతంలో మావోయిస్టులు తలదాచుకున్నారనే సమాచారంతో జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ అధ్వర్యంలో పోలీసులు అక్కడికెళ్లి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. గంటల కొద్దీ ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని గ్రీన్ సిటీలో తనిఖీలు కొనసాగడంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. గ్రీన్ సిటీలోని ఒక ప్రదేశంలో ఉన్న ఇంట్లో మావోయిస్టులు మూడు వారాలుగా ఉంటున్నారని పోలీసులు గుర్తించారు. వెంటనే స్పెషల్ పార్టీ బలగాల అధ్వర్యంలో ఆ ఇంటిని చుట్టుముట్టి వారిని అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతానికి విచారణ నిమిత్తం తరలించారు. 2004లో మావోయిస్టులు ఏలూరు జిల్లాలోని బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం గిరిజన ప్రాంతాలను షెల్టర్ జోన్లుగా వినియోగించేవారు. కాలక్రమేణా మావోయిస్టులు జిల్లాను విడిచి ఆంధ్రా, చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లడంతో గత రెండు దశాబ్దాల కాలంగా ఏలూరు జిల్లాలో మావోయిస్టుల కార్యకలాపాలు గాని, ప్రాబల్యాలు గాని లేవనే చెప్పొచ్చు. తాజా ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఒడిశాకి చెందిన మావోయిస్టులు మూడు వారాలుగా గ్రీన్ సిటీ ప్రాంతంలో ఒక ఇంటిని అద్దెకి తీసుకొని నివాసం ఉంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వారంతా మావోయిస్టులా? లేక మావోయిస్టు సానుభూతిపరులా? అనేది తేలాల్సి ఉంది.

– విజయవాడ కానూరు వద్ద ఉన్న కొత్త ఆటోనగర్‌లోని ఓ భవనంలో మావోయిస్టులు బస చేశారన్న పక్కా సమాచారంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసుల సహకారంతో నలువైపుల నుంచి భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సోదాలు జరిపిన బలగాలు దాదాపు 32 మందిని అదుపులోకి తీసుకుని వారిని ప్రశ్నించేందుకు రహస్య ప్రాంతాలకు తరలించారు. మొత్తం భవనాన్ని కొత్త ఆటోనగర్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టుల్లో 21 మంది మహిళలు, మరో ఏడుగురు కీలక హోదాల్లోని వ్యక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. సానుభూతిపరులు, మిలీషియా సభ్యులను విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహణకు తమవెంట తీసుకొచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. నాలుగు చోట్ల డంప్‌లు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు అందిన సమాచారంతో వాటి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టుల తలదాచుకున్న భవన వివరాలపైనా ఆరా తీశారు. ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోన్న ఓ వ్యక్తి నెల రోజులుగా విజయవాడలో ఉండడం లేదని, విదేశాలకు వృత్తిపరమైన పనిమీద వెళ్లినట్లు తెలిసింది. భవనం తాళాలను వాచ్‌మెన్ వద్ద ఉంచి వెళ్లారని, ఆయన పాత్రపైనా ఆరా తీస్తున్నారు.

సాయిలీల, సాయికృష్ణకు ఐజీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కుమార్తె సాయిలీల, సాయికృష్ణ దంపతులకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లిలోని రామకృష్ణ గృహానికి మంగళవారం ఏలూరు రేంజ్ ఐజీ విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సందేహం వద్దు... నితీశే సీఎం: గిరిరాజ్ సింగ్

న్యూదిల్లీ: బీహార్ తదుపరి ముఖ్యమంత్రి విషయంలో గందరగోళం వద్దని, నితీశ్ కుమార్ సీఎంగా కొనసాగుతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చేశారు. ఎన్డీయే విజయంతో తదుపరి సీఎంపై ఊహాగానాలకు తెరదించారు. గిరిరాజ్ మంగళవారం ఇండియా ఇంటర్నేషన్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్) సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నితీశ్ సీఎంగా ఉంటారని విశ్వాసం వ్యక్తంచేశారు. 'భ్రమలు-గందరగోళం ఎందుకు? తుదుపరి ముఖ్యమంత్రి నితీశ్ కుమారే అనడంలో సందేహం లేదు. అయితే సీఎం ఎంపిక ఓ పద్ధతి ప్రకారం జరుగుతోంది' అని ఆయనన్నారు. బీజేపీ, జేడీయూ శాసనసభాపక్ష పార్టీ సమావేశాలు విడిగా జరుపుతాయని, ఆ తర్వాతే ఎన్డీయే భేటీ ఉంటుందని అన్నారు. ఎన్డీయే బీహార్ సీఎంను తన పద్ధతిలో ఎంచుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తోందన్నారు.

రేపు బీహార్‌కు చంద్రబాబు, లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బీహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వారు బీహార్ వెళ్లనున్నారు. నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్రపక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు ఎన్డీయే ముఖ్యనేతలంతా హాజరవుతారని సమాచారం. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరపున రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు.

సతీశ్ హత్య కేసులో వైసీపీ నేత అరెస్టు

విశాలాంధ్ర-గుంతకల్లు: సంచలనం సృష్టించిన జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ హత్య కేసులో వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి అరెస్టు అయ్యారు. తాడిపత్రి రూరల్ పోలీసులు ఆయనను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గుంతకల్లు డీఎస్పీ కార్యాలయానికి తరలించి, విచారించారు. విషయం తెలిసిన వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామరెడ్డి, ఎమ్మెల్సీ శివరాంరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు నైరుతి రెడ్డి, గుంతకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, గాదిలింగేశ్వర బాబు (చిన్న బాబు), వైసీపీ నాయకులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు తరలిరావడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. కాగా, ఓ టీవీ ఛానల్ చర్చలో పాల్గొన్న సందర్భంగా సతీశ్ హత్యపై చేసిన వ్యాఖ్యలే కారుమూరు అరెస్టుకు దారితీసినట్లు తెలుస్తోంది.

పురావస్తు శాఖలో కాంట్రాక్ట్ కార్మికులకు 1/30వ స్టేటస్

డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్‌లో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల (క్యాజువల్ లేబర్) కు ఏపీ హైకోర్టు ఆదేశాల ప్రకారం 1/30వ స్టేటస్‌ను వెంటనే అమలు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కేంద్ర అధికారులను కోరారు. దిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ డీజీ యదుబీర్ సింగ్ రావత్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు మంగళవారం ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గండికోట, సిద్ధవటం, ఒంటిమిట్ట, పుష్పగిరి ఆలయ సముదాయం, దానవలపాడు, పెద్దముడియం ప్రాంతాల్లో పని చేస్తున్న 11 మంది సహా మొత్తం 13 మంది హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు వారికి 1/30వ స్టేటస్ ఇవ్వాలని అక్టోబరు 7న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని జాస్తి తెలిపారు. అమరావతి సర్కిల్ పరిధిలోని అమరావతి, నాగార్జునకొండ, లేపాక్షి, గుత్తి కోట, చంద్రగిరి కోట, శాలిగుండం, శంకరం వంటి ప్రముఖ స్మారకాల్లో 150 మంది కార్మికులు 15 నుంచి 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారని వివరించారు. కార్మికులకు 1/30 స్టేటస్‌తో పాటు పెండింగ్ జీతభత్యాల చెల్లింపునకు అమరావతి సర్కిల్ అధికారులకు తక్షణం ఆదేశాలు జారీ చేయాలని ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు.

ఎస్సీ, ఎస్టీల విద్యకు పెద్దపీట: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఆయన మంగళవారం విజయవాడలోని ఐఐటీ-నీట్ ఎక్సలెన్సీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఐఐటీ, నీట్ అవకాశాన్ని కోల్పోయిన అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ప్రభుత్వం లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తున్న సందర్భంలో మంత్రి స్వయంగా సౌకర్యాలు పరిశీలించారు. హాస్టల్, భోజనం, తరగతుల నిర్వహణపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరాలని విద్యార్థులకు మంత్రి డోలా సూచించారు. అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లను 3 నుంచి 10కి విస్తరించామని మంత్రి తెలిపారు. విజయవాడ కబేళా సెంటర్‌లో రూ.80 లక్షలతో శాశ్వత లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. పేద విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోదన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.